




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 110 | బుధవారం 24 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## నేతల విగ్రహాల కోసం ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారా?

### - సుప్రీంకోర్టు ప్రశ్న

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

'మీ నేతలను కీర్తించేందుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారు" అంటూ.. తమిళనాడు డిఎంకె ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేయగా.. సుప్రీం కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో.. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్‌లతోకూడిన ధర్మాసం తమిళనాడు ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. "అసలు విగ్రహ ఏర్పాటునకు ప్రభుత్వ నిధులను ఎందుకు ఉపయోగించాలి?. మీ మాజీ నేతలను కీర్తించడానికి ప్రభుత్వ నిధులను ఎందుకు ఖర్చు చేయాలి?" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ విషయంలో గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సమర్థిస్తూ ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టేసింది. అలాగే.. రాష్ట్ర ప్రభుత్వం తన అభ్యర్థనను ఉపసంహరించుకుని మళ్లీ హైకోర్టునే

- మిగతా 2లో..



## అన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌కు సిద్ధం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

బీహార్‌లో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వివాదాస్పదమైంది. వివిధ కారణాలతో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల దాదాపు 65 లక్షల మంది ఓటర్లను ఇసి తొలగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని అన్యాయంగా ఓట్లను తొలగించకూడదని సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని హెచ్చరించినా.. ఇసి ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. బిజెపికి కీలుబొమ్మగా మారిపోయిన ఇసి.. అన్ని రాష్ట్రాల్లోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలని యత్నిస్తోంది. ఇప్పటికే ఆవిధమైన ప్రయత్నాలను ఎన్నికల సంఘం మొదలుపెట్టింది.

ఈ నెలాఖరుకు (సెప్టెంబర్ 30) నాటికి ఎస్ఐఆర్‌ను చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల(సిఇవో)ను ఎన్నికల సంఘం కోరింది. బహుశా అక్టోబర్ - నవంబర్ నాటికి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## కోల్‌కతాలో కుంభవృష్టి

- 10 మంది మృతి
- 24 గంటల్లోపు 251 మీ.మీ వర్షపాతం




**కోల్‌కతా - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి నగరం అంతటా రోడ్లు, నివాస సముదాయాలు జలమయమయ్యాయి. దీంతో మంగళవారం నగరం అంతటా ట్రాఫిక్, ప్రజా రవాణా, రోజువారీ జీవితం స్తంభించిపోయింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా 10 మంది మరణించారు. వీరంతా విద్యుత్‌షాక్‌తో మరణించడం మరింత విషాదం. అలాగే, నగరంలో 24 గంటల కంటే తక్కువ

- మిగతా 2లో..

## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను...

- ఐరాస సర్వసభ్య సమావేశంలో మరోసారి పాత వ్యాఖ్యల పునరుద్ఘాటణ
- తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అసంతృప్తి
- ఉక్రెయిన్ యుద్ధానికి భారత్, చైనాలు రష్యాకు నిధులు ఇస్తున్నాయని ఆరోపణ
- యుద్ధాలను ఆపడంలో ఐక్యరాజ్యసమితి విఫలమైందని తీవ్ర విమర్శ
- యూరప్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించకపోతే తీవ్ర సుంకాలు తప్పవని హెచ్చరిక



**వాషింగ్టన్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన పాత వాదనను పునరుద్ఘాటించారు. ఇటీవల భారత్,

- మిగతా 2లో..

## తెలంగాణలో స్థానిక సమరానికి సర్కార్ సై..

- నాలుగైదు రోజుల్లో నోటిఫికేషన్?
- స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ కసరత్తు ముమ్మరం
- నాలుగైదు రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు నిర్ణయం
- నేటి సాయంత్రానికి పూర్తికానున్న రిజర్వేషన్ల ప్రక్రియ
- 2024 కుల సర్వే ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపు
- సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి అందనున్న తుది జాబితా



**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించిన సర్కార్, అందుకు సంబంధించిన ప్రక్రియను దాదాపు పూర్తి చేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారును ముమ్మరం చేసిన అధికారులు, మంగళవారం సాయంత్రానికల్లా తుది జాబితాను ప్రభుత్వానికి సీల్డ్ కవర్‌లో అందించనున్నారు. ఈ జాబితాను పరిశీలించిన వెంటనే, నాలుగైదు రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

**కుల సర్వే ఆధారంగా బీసీ రిజర్వేషన్లు**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. ఇందులో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనుండగా, బీసీలకు మాత్రం ఇటీవల నిర్వహించిన 2024 కుల సర్వే

- మిగతా 2లో..



## ప్రతిపక్ష హోదా ఇవ్వండి

### - హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు స్పీకర్ తిరస్కరిస్తూ ఇచ్చిన రూలింగ్‌ను సవాల్ చేస్తూ వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారణ చేయనుంది. పతిపక్ష నేత హోదా ఇచ్చేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని ఈ పిటిషన్‌లో కోరారు. దీనిలో అసెంబ్లీ సెక్రటరీ, స్పీకర్ కార్యాలయ కార్యదర్శి, న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శిలతోపాటు స్పీకర్

- మిగతా 2లో..

## రెండేళ్ళలో మెడికల్ కళాశాలలు పూర్తి చేస్తాం

- వైద్యారోగ్యరంగంలో పీపీపీతోనే లక్ష్యాల సాధన
- శాసనసభలో సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

వైద్యారోగ్యరంగంలో మౌళిక సదుపాయలతో పాటు అనుకున్న లక్ష్యాలను వేగవంతంగా సాధించాలంటే పీపీపీ మోడ్‌లో ముందుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శాసనసభలో మంగళవారం వైద్యారోగ్యశాఖపై జరిగిన చర్చలో సిఎం పవన్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విధానంలో రాబోయే రెండు సంవత్సరాల్లో మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని చెప్పారు. ఆర్దిక సంస్కరణలో భాగంగా ఈ విధానం ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. దీనిలో 33 ఏళ్ల తర్వాత తిరిగి ఆయా ప్రాజెక్టులు ప్రభుత్వ చేతుల్లోకి వస్తాయన్నారు. ఐఐటి చెన్నై, ఉదయపూర్, నాగపూర్ వంటి ప్రతిష్మాత్మక సంస్థలు సైతం కొన్ని ప్రాజెక్టులను పిపిపి విధానంలో చేపట్టాయని చెప్పారు. గతంలో పిపిపి విధానంలో చేపట్టిన జేగూరుపాడు విద్యుత్తు ప్రాజెక్టు కాలపరిమితి ముగిశాక నేడు ప్రభుత్వం చేతికి వచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో

- మిగతా 2లో..



## ఉచిత సలహాలొద్దు.. యూరియా ఇవ్వండి

### - ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

రైతులకు ఉచిత సలహాలను కట్టిపెట్టి, యూరియా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. యూరియా సకాలంలో ఇవ్వడం చేతకాక, రోగాల పేరుతో రైతులను నింధించడం తగదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా కొరతపై కూటమి ప్రభుత్వం చెప్పేవన్నీ కుంటి సాకులు, అవాస్తవాలని తెలిపారు. యూరియా ఎక్కువ వాడుతున్నారని, కేన్సర్‌కు కారణం అవుతున్నారని సిఎం చంద్రబాబు చెప్పడాన్ని తప్పుపట్టారు. అసెంబ్లీ వేదికగా రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన 6.65 లక్షల టన్నుల కోటాలో ఇంకా లక్ష టన్నులు ఇవ్వకుండా కేంద్రం చోద్యం చూస్తుంటే, ప్రధాని మోడీని నిలదీసే సత్తా లేక రైతులను తప్పుపట్టడం బాధాకరమని పేర్కొన్నారు.

# కోల్‌కతాలో కుంభవృష్టి

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో 251.4 మీమీ వర్షపాతం నమోదయింది. 1986 తరువాత (259.5 మీ.మీ) ఇదే అత్యధిక వర్షపాతం. గత 137 ఏళ్లలో ఇది ఆరో అత్యధిక వర్షపాతం. నగరంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాలలో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందని, గరియా కామదహరిలో కొన్ని గంటల్లోనే 332 మీ.మీ వర్షపాతం, జోధ్‌పూర్ పార్క్‌లో 285 మీ.మీ వర్షపాతం నమోదైందని కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కెఎంసి) తెలిపింది. అలాగే, కాలిఘాట్‌లో 280 మీ.మీ, టాప్సియాలో 275 మీ.మీ, బల్లిగంజ్‌లో 264 మీ.మీ, ఉత్తర కోల్‌కతాలోని తంతానియాలో 195 మీ.మీ వర్షపాతం నమోదైందని తెలిపింది. తెల్లవారుజామున 2,30 గంటల నుంచి 5.30 గంటల మధ్యే ఎక్కువ వర్షపాతం నమోదయిందని పేర్కొంది. వర్షాల కారణంగా బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో దసరా సెలవులు రెండు రోజుల ముందే ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 నుంచి దసరా సెలవులను ఇప్పటికే ప్రకటించారు. రైల్వే ట్రాక్‌లు పూర్తిగా నీటితో నిండిపోవడంతో మెట్రో సర్వీస్‌తో పాటు, హౌరా, కోల్‌కతా టెర్మినల్ స్టేషన్లకు రైలు సేవలను నిలిపివేశారు. విమాన ప్రయాణం కూడా తీవ్రంగా ప్రభావితమైంది. కనీసం 30 విమానాలు రద్దు చేశారు. మరో 31 విమానాలు ఆలస్యంగా నడిచాయి. కాగా, సోమవారం ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 25 నాటికి ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

# నేతల విగ్రహాల కోసం ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. తిరునల్వేలి జిల్లాలోని వల్లియూర్ డైలీ వెజిటబుల్ మార్కెట్ ప్రధాన రహదారిలో ఉన్న పబ్లిక్ ఆర్చ్ ప్రవేశ ద్వారం వద్ద ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కాంస్య విగ్రహం, నేమ్ బోర్డును ఏర్పాటు చేయాలని తమిళనాడు ప్రభుత్వం భావించింది. అయితే.. అది ప్రభుత్వ స్థలం. పబ్లిక్ ప్లేసుల్లో విగ్రహాలు, నేమ్ బోర్డులు వంటి నిర్మాణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యం, పైగా భద్రతాపరమైన సమస్యలు తలెత్తవచ్చని అభిప్రాయపడుతూ మద్రాస్ హైకోర్టు నిరాకరించింది. దీనిపై మద్రాస్ హైకోర్టు తీర్పున సవాల్ చేస్తూ.. తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. అక్కడా చుక్కెదురైంది.

# అన్ని రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్‌కు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమం ప్రారంభించే అవకాశం ఉంది. ఈ నెల ప్రారంభంలో న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశంలో.. రాబోయే 10 నుండి 15 రోజుల్లో ఎస్‌ఐఆర్ అమలుకు సిద్ధంగా ఉండాలని కోరినట్లు అధికారులు తెలిపారు. గత ఎస్ఐఆర్ తర్వాత ప్రచురించబడిన ఓటర్ల జాబితాను రాష్ట్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని భారత ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ఈ సమావేశంలో పేర్కొన్నారని అధికారులు తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల సిఇఓలు తమ చివరి ఎస్‌ఐఆర్ తర్వాత ప్రచురించిన ఓటరు జాబితాలను తమ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఢిల్లీ సిఇఓ 2008 ఎస్‌ఐఆర్ ఓటర్ల జాబితాను తమ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఉత్తరాఖండ్ 2006, బీహార్‌లో 2003లో చేపట్టిన ఎస్‌ఐఆర్ జాబితా ఉంది. దాదాపు అన్ని రాష్ట్రాలు 2002–2004 మధ్య చేపట్టిన ఎస్‌ఐఆర్ జాబితానే వెబ్‌సైట్లలో ఉంచాయి. బీహార్ ఎస్‌ఐఆర్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఇసి గతంలో వెల్లడించింది. వచ్చే ఏడాది అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ఇసి ఎస్‌ఐఆర్ ప్రక్రియను ముమ్మరం చేస్తోంది. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల ప్రజలు భారత్‌లోకి చొరబడుతున్న అక్రమ వలసల్ని అరికట్టడమే ఎస్‌ఐఆర్ లక్ష్యమని ఇసి వెల్లడించింది.

# తెలంగాణలో స్థానిక సమరానికి సర్కార్ సై..

(మొదటిపేజీ తరువాయి)

వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్ మొదలుకొని జడ్పీ ఛైర్‌పర్సన్ వరకు మొత్తం ఆరు స్థాయిల్లో కమిషన్ సిఫార్సులు చేసింది. ఆయా ప్రాంతాల్లోని బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించనున్నారు.

**ప్రత్యేక జీఓతో ఎన్నికలకు సన్నాహాలు**

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుపై కేంద్రం నుంచి ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో, హైకోర్టు విధించిన సెప్టెంబర్ 30 గడువు సమీపిస్తుండటంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. రిజర్వేషన్లపై ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ ఉత్తర్వు (జీఓ) జారీ చేసి, ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, గడువు పొడిగించాలని హైకోర్టును కోరే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కీలక పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే ఒక ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారని సమాచారం.

రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామపంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 ఎంపీపీలు, 565 జడ్పీటీసీలు, 31 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ సోమవారం రాత్రి వరకు ముమ్మరంగా సాగింది. వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు, సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఆర్డీవోలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా కలెక్టర్లు, జడ్పీ ఛైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్లు ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# కృష్ణా నదికి వరద ఉధృతి

**విజయవాడ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**

ప్రకాశం బ్యారేజీకి మరోసారి వరద పోటెత్తింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి వరద నీరు దిగువకు విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వరద ఉధృతి కొనసాగుతోంది. 4.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 69 గేట్లను పైకి ఎత్తి దిగువకు 4.11 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఏపిఎల్‌డిఎంఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

# రెండేళ్ళలో మెడికల్ కళాశాలలు పూర్తి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

38 మెడికల్ కళాశాలలు ఉండగా అందులో ప్రభుత్వ రంగంలో 18,ప్రైవేట్‌రంగంలో మరో 18 ఉన్నాయని, వీటితో పాటు ఎయిమ్స్‌మెడికల్ కాలేజీ, గీతం యూనివర్సిటీలో మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. వైసిపి రాజకీయ లబ్ధి కోసం ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తూ మెడికల్ కళాశాలలపై ప్రజలను మభ్య పెడుతోందన్నారు. గత ప్రభుత్వ విధానం ప్రకారం కన్వీనరు కోటాలో ప్రతి కాలేజీలో 64 సీట్లు ఉంటే కూటమి ప్రభుత్వం 75 సీట్లు ఇస్తోందని, మొత్తం మీద ప్రతి కాలేజీలో 11 సీట్లు ఎక్కువగా పేదలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.8480 కోట్లతో మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని చెప్పి ఐదేళ్లలో కేవలం రూ.1550కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే రూ.787కోట్లు ఖర్చుపెట్టామన్నారు. వైసిపి పాలన తరహాలో నిర్మాణాలు చేపడితే మరో 15 ఏళ్ల సమయం పడుతుందన్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణం పిపిపి విధానంలో చేపట్టినా వైద్యసేవలు ఉచితంగానే ఉంటాయని, ఔట్ పేషెంట్ విభాగం సేవలు, మందులు, ఇతర ఆరోగ్యసేవలు ఉచితంగా లభిస్తాయని చెప్పారు.

**ప్రైవేటు ఆస్పత్రుల్లో 90శాతం సిజేరియన్లు**

రాష్ట్రంలో జరుగుతున్న సిజేరియన్లలో 90 శాతం ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఇది మంచిది కాదని, వీటిని తగ్గించాలని ఆయన అన్నారు. మొత్తంమీద రాష్ట్రంలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని, వీటిలో 42శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రైవేటీకరణ, పిపిపి విధానం మధ్య ఉన్న తేడా గురించి తెలియకుండా వైసిపి నేతలు విషప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 4 కళాశాలలకు టెండర్లు పిలిచామన్నారు.

# భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను...

(మొదటిపేజీ తరువాయి)

పాకిస్థాన్‌ల మధ్య తీవ్రస్థాయికి చేరిన ఘర్షణను తానే నివారించానని, తన వల్లే యుద్ధం ఆగిపోయిందని చెప్పుకొచ్చారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో మంగళవారం ప్రసంగించిన ఆయన, ఈ ఘనత తనదేనని చెబుతూనే.. తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై తన ఆవేదనను వెళ్లగక్కారు. ఐరాస ఉన్నతస్థాయి సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించిన ట్రంప్, “నేను ఏడు యుద్ధాలను ముగించాను. అవన్నీ తీవ్రంగా కొనసాగుతున్నవే! వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో నేను జోక్యం చేసుకున్నాను” అని తెలిపారు. “అందులో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం కూడా ఉంది” అని ఆయన వ్యాఖ్యానించారు.

అయితే, ట్రంప్ వాదనను భారత్ ఇప్పటికే పలుమార్లు ఖండించింది. ఈ విషయంలో ట్రంప్ జోక్యం ఏమీ లేదని, ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల ద్వారానే సమస్య పరిష్కారమైందని ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే జూన్‌లో జరిగిన ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు స్పష్టం చేశారు. పాకిస్థాన్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్‌కు ఫోన్ చేసి కాల్పుల విరమణకు అంగీకరించారని భారత వర్గాలు వెల్లడించాయి. ఇదే సమావేశంలో ట్రంప్.. భారత్, చైనాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు ఈ రెండు దేశాలు రష్యాకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు, రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న నాటో మిత్రదేశాలు, యూరోపియన్ యూనియన్‌పైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. “రష్యా యుద్ధాన్ని ఆపేందుకు సిద్ధపడకపోతే, అమెరికా శక్తిమంతమైన సుంకాలను విధించడానికి సిద్ధంగా ఉంది. ఈ సుంకాలు ప్రభావవంతంగా ఉండాలంటే యూరప్ దేశాలు కూడా మాతో కలవాలి” అని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలో శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని ట్రంప్ దుయ్యబట్టారు. “ఈ పనులన్నీ ఐరాస చేయాల్సింది, కానీ నేనే చేయాల్సి వచ్చింది. విచారకరమైన విషయం ఏంటంటే, ఈ సందర్భాల్లో ఐరాస కనీసం సాయం చేసే ప్రయత్నం కూడా చేయలేదు” అని ఆయన విమర్శించారు. తన ప్రసంగం మధ్యలో టెలిప్రాంప్టర్ ఆగిపోయినా, ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపకుండా కొనసాగించడం గమనార్హం.

# పెట్టుబడుల కోసం శ్రమిస్తున్నాం : మంత్రి లోకేష్

**అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**



పెట్టుబడుల కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మండలిలో పరిశ్రమలపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. విశాఖలో ఉర్సా కంపెనీకి రూపాయికే ఎకరం భూమి కట్టబెట్టారని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. టిసిఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఒక్కో కంపెనీ 25 వేల ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. రూ.15 వేలకోట్ల ఎకనామిక్ యాక్టివిటీ క్రియేట్ అవుతుందన్నారు. ఈ రెండు కంపెనీలకు మాత్రమే రూపాయికి భూములిచ్చామని, ఇక ఏ కంపెనీకి ఇవ్వలేదని తెలిపారు. ఈ రెండు కంపెనీలకు భూములు ఇవ్వొచ్చా, ఇవ్వకూడదా? బొత్స సత్యనారాయణ క్లారిటీ ఇవ్వాలన్నారు. అధికారంలోకి వస్తే కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించిన భూములను రద్దు చేస్తామంటూ వైసిపి బెదిరిస్తోందని, ఈ విషయాన్ని టిసిఎస్ అడుగుతోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. తాము కష్టపడి ఇప్పటికి రూ.10.4 లక్షల కోట్ల పెట్టుబడులకు 340 ఎంఒయు కుదుర్చుకున్నామని తెలిపారు.

పరిశ్రమలకు విలువైన భూములు ధారాదత్తం చేస్తున్నారంటూ మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. 2023లో తాము విశాఖలో నిర్వహించిన సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఒయులు కుదిరాయన్నారు. ఏ సమ్మిట్‌కు రాని ముఖేష్ అంబాని, అదాని, నవీన్ జిందాల్ వంటి వారు కూడా వచ్చారని తెలిపారు. వైఎస్ జగన్‌పై నమ్మకంతోనే పెద్ద పారిశ్రామిక వేత్తలు వచ్చారని గుర్తు చేశారు. విశాఖలో 2005 నుంచి ఇప్పటి వరకు అనేక కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. అదాని డేటా సెంటర్ తమ హయాంలోనే వచ్చిందన్నారు. లూలూ కంపెనీని తాము తరిమేయలేదని, వారు మలేషియాలో అనేక కంపెనీలు, మాల్స్‌లు బోర్డు తిప్పేశారని గుర్తుచేశారు. అలాంటి వారికి ప్రభుత్వ స్థలాలు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అయ్యన్న పాత్రుడు, శాసనవ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అసెంబ్లీలో సభా నాయకుడి తర్వాత ప్రతిపక్ష నేతతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించే సంప్రదానికి వీడ్కోలు పలికారని, సీఎం, మంత్రులు ప్రమాణం తర్వాత తనకు అవకాశం ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ‘ప్రతిపక్ష నేత హెూదా ఇవ్వాలని స్పీకర్‌కు లేఖలు రాశాను. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈనేపథ్యంలో మంత్రి పయ్యావుల మీడియా ద్వారా తనకు ప్రతిపక్ష నేత హెూదా ఇవ్వడం అసాధ్యం కాదని ప్రకటించారు. పది శాతం సీట్లు రానందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ప్రతిపక్ష నేత హౌదా ఇవ్వబోమని బహిరంగంగానే అధికార పార్టీ నేతలు ప్రకటించారు. దీని బట్టి స్పీకర్ రూలింగ్ వెనక ఉన్నదెవ్వరో అర్ధం అవుతోంది.’ అని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత హౌదా విషయంలో రాజ్యాంగంలోని 208 అధికరణ కింద నిర్ధిష్టమైన నియమావళి ఉంది. దీని ప్రకారం. ప్రతిపక్ష హౌదా ఇవ్వాలని ఆయన కోరారు.

# 9,600 స్కూళ్లలో తరగతికో టీచర్..

- దేశంలోనే ఇది రికార్డ్: మంత్రి నారా లోకేశ్
- 9,600 ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడి నియామకం
- దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో అమలు కాలేదన్న మంత్రి
- విద్యార్థుల్లో నైతిక విలువల పెంపునకు చాగంటి కోటేశ్వరరావు సలహాదారుగా నియామకం
- ప్రభుత్వం నుంచి చాగంటి ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదన్న లోకేశ్
- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ అంశం కోర్టు పరిధిలో ఉందని వెల్లడి
- ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ

**అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23**



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,600 ప్రాథమిక పాఠశాలల్లో ‘తరగతికి ఒక ఉపాధ్యాయుడు’ విధానాన్ని అమలు చేశామని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో ఈ ఘనత సాధించ లేదని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. గత ప్రభు త్వ హయాంలో జీవో 117 కారణంగా కేవలం 1200 పాఠశాలల్లో మాత్రమే తరగతికో టీచర్ అందుబాటులో ఉండేవారని లోకేశ్ గుర్తు చేశారు. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సంఖ్యను 9,600 కు పెంచిందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అక్షరా స్యత, సంఖ్యా శాస్త్రంలో విద్యార్థులు గ్యారెంటీగా నైపుణ్యం సాధించడమే లక్ష్యంగా పెట్టుకు న్నామని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

**నైతిక విలువల కోసం చాగంటి సేవలు**

విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఈ సందర్భంగా చాగంటి నిస్వార్థ సేవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. “చాగంటి గారు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదు. కనీసం ఫోన్ గానీ, వాటర్ బాటిల్ గానీ స్వీకరించడం లేదు. ఆయన రూపొందించిన అద్భుతమైన పుస్తకాలను ప్రింట్ చేసి విద్యార్థులకు అందిస్తున్నాం” అని లోకేశ్ ప్రశంసించారు.

ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కమిటీ చట్టం–2019కి సంబంధించిన అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని మంత్రి తెలిపారు. ఇక, ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, బీసీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎక్కడైనా సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి చర్యలను ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జాతీయ విద్యా ప్రమాణాల సర్వే (న్యాస్) నివేదికను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని లోకేశ్ పునరుద్ఘాటించారు.

# సంపాదకీయం



## జీఎస్టీ సవరణతో
## అమెరికాకు చెక్

జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో కోట్ల మంది భారతీయుల రోజువారీ ఆర్థిక భారం కొంత తగ్గనుంది.నిత్యావసరాలైన పాలు, బ్రెడ్ వంటి వాటితోపాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రాణాధార ఔషధాలు లాంటి వాటిపై పన్నును పూర్తిగా తొలగించారు.చిన్న కార్లు, టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్ల మీద పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. ఇతర సాధారణ వస్తువులైన హెయిర్ ఆయిల్, సబ్బు, షాంపూ వంటి వాటిపై 12 లేదా 18 శాతానికి బదులుగా 5 శాతం పన్ను మాత్రమే ఉంటుంది.వస్తు సేవల పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల ప్రారంభంలో ప్రకటించారు.దీని వల్ల పన్నుల విధానం సరళీకృతంగా మారుతుందని...ఇంటి ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు.విజయ దశమి పండుగ సందర్భంగా ప్రజలు కొత్త కార్లు, దుస్తులు కొనుగోలు చేస్తారు. ఇలాంటి సమయంలో జీఎస్టీ రేట్లు తగ్గించడం పండగ సీజన్‌లో కొత్త వస్తువుల కొనుగోలుకు ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.పన్ను తగ్గింపు వల్ల వినియోగ వస్తువులైన ప్యాకేజ్డ్ ఫుడ్, దుస్తుల అమ్మకాలు ఈ నాలుగు నెలల్లో పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.అమెరికా విధించిన 50శాతం సుంకాల ప్రభావాన్ని జీఎస్టీ సవరణ తగ్గించవచ్చు.ప్రజలకు డబ్బు మిగలడం వల్ల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబులను మార్చడం ద్వారా రాయితీలు, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించడం, తాజాగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ కోతలు కొనుగోళ్లు పెరగడానికి సానుకూలంగా ఉన్నాయి.రిలయన్స్, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి సంస్థలు పన్నుల తగ్గింపు లాభాన్ని వినియోగదారులకు అందించడం ద్వారా అమ్మకాల్ని పెంచుకుంటున్నాయి.ఆగస్టులో ప్రధాని మోదీ ప్రకటన తర్వాత కార్ల తయారీ సంస్థలు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో కార్ల కంపెనీల షేర్లు 6-17 శాతం పెరిగాయి.జీఎస్టీ సవరణల తర్వాత కార్ల గురించి అడిగే వారి సంఖ్య పెరిగిందని డీలర్లు చెబుతున్నారు.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు 30 నుంచి 40శాతం పెరుగుతాయని భావిస్తున్నట్లు ముంబయిలోని హీరో మోటోకార్ప్ షోరూమ్ డీలర్ ఒకరు చెప్పారు.”ధరలు తగ్గడంతో తొలిసారి బైక్ కొంటున్న వారి నుంచి ఎంక్వైరీలు ఎక్కువగా వస్తున్నాయి” అని హీరో మోటోకార్ప్ సంస్థ ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అశుతోష్ వర్మ వివరించారు.ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి “తక్కువ ధర మోడళ్ల” విషయంలోనే ఉండేదని ఆయన అన్నారు.తాను ఈ ఏడాది 200సీసీ బైక్ కొనాలని భావిస్తున్నట్లు విశాల్ పవార్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెప్పారు.”పండుగ డిస్కౌంట్లు, పన్నుల కోత వల్ల ఏదైనా కొనడానికి ఇదే మంచి సమయం. ఈ దసరా పండగ సందర్భంగా నేను బైక్ కొంటున్నాను” అని ఆయన అన్నారు.ఇకపై తమ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరుగుతాయని వినియోగ వస్తువుల తయారీ సంస్థలు కూడా ఆశాభావంతో ఉన్నాయి.పన్ను తగ్గింపుతో పాటు దేశావ్యాప్తంగా ఈ ఏడాది పంటలు బాగా పండటంతో ఎయిర్ కండీషనర్ల వంటి వస్తువుల మార్కెట్ మెట్రో నగరాలను దాటి విస్తరిస్తుందని భావిస్తున్నట్లు గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సవ్యసాచి గుప్తా చెప్పారు.అయితే జీఎస్టీ తగ్గించడం వల్ల గోద్రెజ్ లాంటి కంపెనీలు డిమాండ్ ఏ మేరకు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ధరల తగ్గింపుకు సంబంధించిన లేబుల్స్ ముద్రించడంలో బిజీగా మారాయి.మేం పాత, కొత్త ధరలను పక్క పక్కనే ముద్రిస్తున్నాం. దాని వల్ల వినియోగదారుడికి ధర ఎంత తగ్గిందో తెలుస్తుంది” అని సవ్యసాచి గుప్తా బీబీసీకి చెప్పారు.చిన్న బ్రాండ్లు, దుకాణదారులు తగ్గిన పన్నులకు అనుగుణంగా ధరల్ని సవరించే పని పూర్తి స్థాయిలో చేపట్టలేదు.వారి వద్ద తగినంత సమయం, వర్కర్లు లేకపోవడంతో తగ్గిన ధరలతో ప్యాకింగ్ చేయడం కష్టంగా మారింది.ముంబయిలోని ప్రఖ్యాత క్రాఫోర్డ్ మార్కెట్ నగరంలో అతి పెద్ద హోల్‌సేల్ రిటైల్ మార్కెట్.ఇక్కడ సుగంధ ద్రవ్యాల నుంచి గుండీల వరకు అన్నీ అమ్ముతారు.జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల గురించి ఈ మార్కెట్‌లో కొద్ది మంది దుకాణదారులకు మాత్రమే అవగాహన ఉంది.అవగాహన ఉన్న వారిలోనూ అయోమయం కనిపిస్తోంది.తాను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన వస్తువుల ధరల్ని సవరించిన శ్లాబులకు అనుకుణంగా ఎలా మార్చాలనే దాని గురించి సరఫరాదారులతో చర్చిస్తున్నట్లు టపాసుల దుకాణం నిర్వహిస్తున్న షేక్ రెహమాన్ చెప్పారు.ఆయన దుకాణానికి పక్కనే ఉన్న బ్రైడల్ షోరూమ్‌లో నిరాశ కనిపిస్తోంది.ప్రభుత్వం రెండున్నర వేల రూపాయల కంటే తక్కువ ఉన్న దుస్తులపై జీఎస్టీ తగ్గించింది. అంత కంటే ఎక్కువ ధర ఉన్న దుస్తులపై జీఎస్టీ 18శాతంగా ఉంది.పెళ్లికి ధరించే దుస్తుల ధరలు రెండున్నర వేల రూపాయల కంటే ఎక్కువే ఉంటాయి. దీంతో నరేష్‌కు చెందిన బ్రైడల్ షోరూమ్‌లో దుస్తులు కొంటే 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.దీని ప్రభావం సరఫరా వ్యవస్థలతో పాటు డిజైనర్లు, చేనేత కళాకారులు, రిటైలర్లు, కస్టమర్లపై పడుతుంది.”భారతీయులు పెళ్లికి ధరించే దుస్తుల మీద భారీగా ఖర్చు పెడతారు. పెళ్లిళ్ల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. అయితే పన్నుల పెరుగుదల వల్ల ఈ ఏడాది కొనుగోళ్లు కాస్త మందగించవచ్చు” అని నరేష్ చెప్పారు అయితే జీఎస్టీ తగ్గింపు ప్రభావం విస్తృత స్థాయిలో సానుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.”జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజల నెలవారీ ఖర్చులో మూడోవంతు ప్రయోజనం కలుగుతుంది. దీని వల్ల వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది” అని క్రిసిల్ రేటింగ్ ఏజెన్సీ చెబుతోంది.జీఎస్టీ సవరణ ప్రభావం “తయారీ సంస్థలు ధరల తగ్గింపును ఏ మేరకు వినియోగదారులకు అందిస్తాయి” అనే దానిపై ఉంటుందని రేటింగ్ ఏజన్సీ క్రిసిల్ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రభావం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంపైనా ఉంటుందని అంచనా వేసింది.వస్తు సేవల పన్ను శ్లాబుల్లో మార్పుల వల్ల ఏడాదికి వేల కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతామని ప్రభుత్వం అంచనా వేసింది.అయితే మూడీస్ లాంటి రేటింగ్ ఏజన్సీస్ మాత్రం ప్రభుత్వ అంచనాల కంటే ఎక్కువే ఉండవచ్చని భావిస్తున్నాయి. రానున్న సంవత్సరాల్లో ఖజానాపై భారం ఇంకా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నాయి.గతేడాది 20శాతం పెరుగుదలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ పన్ను వసూళ్లు స్వల్పంగా పెరిగాయి. అయితే ఖర్చుల పెరుగుదల 20 శాతం కంటే ఎక్కువగా ఉందిఆర్థిక లోటు నియంత్రణ, ఆదాయ వ్యయాల మధ్య అంతరం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల నిర్మాణంలో వేగానికి రానున్న రోజుల్లో బ్రేకులు వేయాల్సి రావచ్చు.

## విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని
# పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం
## -నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం

విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల కట్టలేనిది. సమాజంలో ఉన్నవారిని చైతన్యపర్చడంతో పాటు, సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేసినట్లవుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు.జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్ ) భారత ప్రభుత్వం చేత 1969 సంవత్సరం ప్రారంభించబడిన యువజన కార్యక్రమం.ఈ పథకాన్ని ప్రారంభించి నేటికీ 57 సంవత్సరాలు. ఇక దీని చరిత్రలోకి పోతే డా. డి.ఎస్. కొఠారి (1964-66) నేతృత్వంలోని విద్యా కమిషన్, విద్య అన్ని దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సి సి) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అని పిలువబడే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని వారు సిఫార్సు చేశారు. 1969 సంవత్సరంలో సెప్టెంబరులో జరిగిన వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ ఈ సిఫారసు ప్రకారంగా,సమస్యను వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో, పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా ‘జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం,సహకారాన్ని అడిగిగారు.విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలుపంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం తెలియని నిర్మల మనస్కులు వీరు. వీరు కూడా సంఘజీవులే, సంఘంలో భాగస్వాములే, కాబట్టి సంఘసేవ (సోషల్ సర్వీస్) వాళ్ళకి బాధ్యత ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి.ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి- లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ.విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే అవకాశాన్ని కల్పించడం ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవను ప్రోత్సహించేందుకు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం రెండు భాగాలుగా విభజించబడింది: సాధారణ కార్యకలాపాలు మరియు ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు. సాధారణ కార్యకలాపాలలో వారంవారీ సమావేశాలు, సమాజ సేవ, సామాజిక సేవా ప్రాజెక్టులు ఉంటాయి. ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు సాధారణంగా 7 రోజుల పాటు నిర్వహించబడతాయి, ఈ సమయంలో విద్యార్థులు శుభ్రపరచడం, మొక్కల పెంపకం మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల వంటి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కళాశాలను పరిశుభ్రంగా వుంచటం- తోటలు పెంచటం- రోడ్లు వెయ్యటం. పరిసర గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామంలో రోడ్లు వేయటం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకి విద్య బోధించడం. ఆరోగ్య సూత్రాలను, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియజేయడం. వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమదాలలోనూ సహాయం చేయడం. ధనవంతుల నుండి విరాళాలు సేకరించి బీదవారికి, అనాథలకు సహాయపడటం. పొదుపు ఆవశ్యకతను, అంటు వ్యాధుల వల్ల వచ్చే అరిష్టాలను అరికట్టే విధానాలను ప్రచారం చేయడం దీని ముఖ్య లక్షణం.

# కాకినాడను వదలని రేషన్ మాఫియా




**కాకినాడ - సూర్య వాస్తవం**

కాకినాడ అనగానే ఠక్కున గుర్తుకు వచ్చేది బీచ్ అనుకుంటారంతా... లేదా పోర్ట్ అనుకుంటారు.. కానీ రాజకీయ విమర్శలపరంగా వెంటనే గుర్తుకు వచ్చేది కాకినాడ పోర్ట్ కేంద్రంగా నడిచే అక్రమ పీడీఎస్ బియ్యం మాఫియా గురించే. సంవత్సరాల కాలంగా వేళ్లూనుకుపోయిన ఈ మాఫియాను అడ్డుకట్ట వేయాలంటే కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటేనే తప్ప మరో మార్గం లేదన్న వాదను ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఎందకంటే గత వైసీపీ పాలనలో ఈ మాఫికా కార్యకలాపాలకు గేట్లు ఎత్తేశారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నేతలే టార్గెట్‌గా అప్పట్లో ఎన్నికల ప్రచారంలో కూడా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కీలక ఆరోపణలు చేస్తూ అధికారంలోకి రాగనే మీ తాట తీస్తామని హెచ్చరించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలల సమమం గడుస్తున్నా కాకినాడ పోర్టు కేంద్రంగా నడుస్తోన్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఏమాత్రం అడ్డుకట్టపడలేదన్నది పలువురి మాటగా వినిపిస్తోంది. తాజాగా ఇదే విషయాన్ని ఇటీవలే అమరావతి జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఏపీ డిప్యూటీ సీఎం సంధించిన పలు ప్రశ్నలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.

కాకినాడ జిల్లా కలెక్టర్‌ను పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేశారు. ఇది రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కానీ పవన్ కళ్యాణ్ ప్రశ్నలకే పరిమితం అయ్యారా అన్న విమర్శలొస్తున్నాయి. ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచార సభల్లో కాకినాడ కేంద్రంగా జరుగుతోన్న అక్రమ బియ్యం రవాణా విషయంలో కీలకంగా వ్యాఖ్యానించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిని హెచ్చరించారు కూడా. అయితే కూటమి ప్రభుత్వం కోలువు తీరింది.. ఒకసారి ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేశారు. సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పలుసార్లు పోర్టులో తనిఖీలు చేసి కొంత సరుకును సీజ్‌కూడా చేయించారు. కానీ ప్రస్తుతం వినిపిస్తోన్న మాట కాకినాడ కేంద్రంగా సాగుతోన్న పీడీఎస్ అక్రమ రవాణా విషయంలో కూటమి ప్రభుత్వం ఏమాత్రం అడ్డుకట్టవేయ లేకపోయిందన్న విమర్శలు వినిపిస్తోన్నాయి.. ఈ కారణమే ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో పవన్ కళ్యాణ్ ఈ ప్రశ్నలు సంధించారన్న ప్రచారం జరుగుతోంది. కూటమికి చెందిన నేతలు, అధికారులు, పీడీఎస్ అక్రమ రవాణా మాఫియాతో కలిసిపోయారని కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా ఎందుకు పెరిగింది? గత ఐదు సంవత్సరాల్లో కాకినాడ పోర్ట్ కేంద్రంగా పిడిఎస్ బియ్యం నమూనా పేరుతో ఎగుమతులు జరుగుతున్నాయి. రేషన్ డీలర్లు, మిల్లర్లు, స్మగ్లర్ల మధ్య నెట్‌వర్క్ ఏర్పడి రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరలో బియ్యం కొని, తిరిగి మిల్లింగ్ చేసి, పెద్దలకి అధిక ధరకు అమ్ముతున్నారని విచారణల్లో తేలితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? ప్రభుత్వ నేతలు, కొన్ని పోలీసు అధికారులు నుంచి కూడా మద్దతు ఉన్నట్లు ఆరోపణలు రావడం వెనుక వాస్తవం ఎంత.? 2024లో కాకినాడ పోర్ట్ ద్వారా సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నులపైగా బియ్యం ఎగుమతి అయినట్లు అధికార లెక్కలు చూపిస్తున్నాయి. ఇందులో అక్రమ పీడీఎస్ బియ్యం వాటా ఎంత.? ఇలా అనేక ప్రశ్నలు సామాన్యుల నుంచి వినిపిస్తున్నాయంటున్నారు.

కాకినాడ పోర్టు కేంద్రంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై జరుగుతోన్న చర్చ అటుంచితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై దృష్టిసారించి చర్యలు ప్రారంభించారనే చెప్పవచ్చు. కాకినాడ పోర్టుపై నియంత్రణ, అక్రమ బియ్యం రవాణా నిరంతర నిఘా.. అధిక చెక్‌పాయింట్లు తనిఖీలు.. అధికారుల నిరంతర తనిఖీల ద్వారా బియ్యం సంబంధిత గోదాములు, లారీలు సీజ్ చేస్తోంది.. ఇటీవలే 85 కేసులు కాకినాడలో నమోదయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలో చూపిన ఉత్సాహం నీరుకారిపోయిందని, ప్రస్తుతం కాకినాడ పోర్టు కేంద్రంగా సాగుతున్న పీడీఎస్ బియ్యం అక్రమ ఎగుమతులు ఏమాత్రం తగ్గలేదని, కానీ పట్టించుకునే నాథులే కరవయ్యారని మాత్రం దీనిపై పెదవి విరుస్తున్నారు..

### ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సుగవాసి

## పాలకొండరాయుడుకి సంతాపం





**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే రాయచోటి పెద్దాయన కీ:శే: పాలకొం డ్రాయుడు రాజకీయ ప్రస్థానం, రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు గురించి అసెంబ్లీలో చాలా అద్భుతంగా తెలి యజేసి, నివాళులు అర్పించి 2 నిముషాలు సభ మొత్తం నిలబడి మౌనం పాటించి సంతాపం తెలియజేసారు, ఈసందర్భంగా పాలకొండరాయుడు కుమారుడు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి, మాన్యశ్రీ ముఖ్య మంత్రి వర్యులునారా చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్‌కి, యువగళం రథసారధి విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు కి, మంత్రులకు, శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

### డీఐజీని మర్యాదపూర్వకంగా

## కలిసిన జిల్లా ఎస్పీ



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ శ్రీకోయ ప్రవీణ్ ఐపీఎస్‌ని, కర్నూలు డీఐజీ కార్యాలయంలో, అన్న మయ్య జిల్లా నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మర్యాద పూర్వ కంగా పుష్పగుచ్ఛంతో కలిశారు. ఈ సందర్భంలో జిల్లా పోలీసు కార్యక లాపాలు, ప్రజా భద్రతా చర్యలు, నేర నియంత్రణ పట్ల అనుసరిస్తున్న వ్యూహాలపై విశదంగా చర్చ జరిగింది. డీఐజీ మాట్లాడుతూ.. ప్రజా భద్రత ప్రథమ కర్తవ్యమని ప్రతి పోలీసు అధికారి గుర్తుంచుకోవాలి. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించడం ద్వారా పోలీసులు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందగలరు. విజిబుల్ పోలీసింగ్ ను బలోపేతం చేస్తూ ప్రజలకు భద్రతా భరోసా కల్పించాలి. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల దాకా పోలీసులు ప్రజలకు చేరువ కావడం అత్యంత అవసరం అని ప్రత్యేకంగా పేర్కొన్నారు. డీఐజీ సూచనలను అమలు చేస్తూ, జిల్లాలో ప్రజలకు మరింత చేరువైన పోలీసింగ్ అందించడానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ హామీ ఇచ్చారు. ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణలో జిల్లా పోలీసులు అహర్నిశలు కృషి చేస్తారని తెలిపారు.

### అనంతపురంలో ఆలయాల

## పునర్నిర్మాణాలకు సహకారం అందించండి

**- దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి**

**- మొదటి రోడ్డు శ్రీ కాశీవిశ్వేశ్వర - కోదండరామ స్వామి ఆలయానికి సంబంధించి విజ్ఞప్తి**

**- ఆలయ పునర్నిర్మాణానికి రూ.4.50కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి**

**- సానుకూలంగా స్పందించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**




**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** – అనంతపురం నగరం లోని ఆలయాల పునర్నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు సహకారం అందిం చాలని.. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మంత్రి ఛాంబర్ కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. నగరంలోని మొదటి రోడ్డు శ్రీ కాశీవిశ్వేశ్వర–కోదండరామ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 4. 50కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆలయానికి సంబంధించిన ఫోటోలను ఇతర వివరాలను మంత్రికి సమర్పించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అనుమతులు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం మొత్తం అంచనా వ్యయంలో 20శాతం దాతల సహకారం తీసుకోవాలని ఉందని.. అయితే అంత మొత్తంలో దాతల నుంచి సమకూరే అవకాశం లేదన్నారు. అందుకే దాతల సహకారాన్ని దయచేసి 10శాతం తగ్గించాలని కోరారు. మిగిలిన 90శాతంకి సంబంధించి పూర్తి అంచనా వ్యయాన్ని కామన్ గుడ్ ఫండ్ నుంచి మంజూరు చేయాలని అభ్యర్థించారు. దీనిపై మంత్రి రామనారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారు. మొదటి రోడ్డు ఆలయంతో పాటు మిగిలిన ఆలయాలకు దేవాదాయశాఖ నుంచి సహకారం

### సమస్యల సుడిగుండంలో

# శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

**- ఇన్‌ఛార్జి పాలన ఇంకెన్నాళ్లు...?**

**- తిక్కోడి పెళ్లిలో తిన్నోడు ... బుద్ధిమంతుడు!**




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలవుతోంది అనంతపురం జిల్లాలో ఉన్నత విద్య అభివృద్ధి ఎలా ఉందో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం చుస్తే సరిపోతుంది. విద్యార్థులు సమస్యలతో సతమతమవుతుంటే ఉన్న ఇంచార్జి వీసీ తనకు ఏమీ పట్టనట్లు నిర్లిప్త ధోరణితో మరో సంవత్సరంలో శాస్వితంగా మూసివేతకు గురవుతుంది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగమేఘాల మీద రాష్ట్రంలో ఉన్న ఉపకులపతులను పొమ్మనలేక పొగ పెట్టారు. గత రెండు సంవత్సరాలుగా ఎదుగూ బొదుగూ లేకుండా విశ్వవిద్యాలయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మారింది. ఏమి చేస్తున్నావ్ కోడలా అంటే ఉలగబోసి తీసుకుంటున్నాను అన్నట్లు ఉంది శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిస్థితి. మూడు నెలలకోసారి జరగాల్సిన పాలకమండలి సమావేశం రెండు సార్లు వాయిదా వేశారు. దీనికితోడు గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లు ఎప్పుడో ఎంబిఏ విభాగంలో జరిగిన ర్యాగింగ్ కు సమాధానం చెప్పకపోతే ఉన్నతవిద్య నిధులు నిలుపుదల చేస్తామని యూజీసీ తాఖీదు ఇచ్చారు. గత ఏడాది జూన్ లో వచ్చిన ఇం చార్జి ఉపకులపతి నిర్లిప్త ధోరణి వలన సమస్యలు జఠిల మైపోయాయి. ప్రతి చిన్న విషయం వేచి చూసే ధోరణి. ఇక్కడ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు పెనం నుంచి పొయ్యిలోకి పడినట్లు భావిస్తున్నారు. దిన దిన గండం నూరేళ్ళాయ్యుష్షు అన్నట్లు విశ్వవిద్యాలయ అధికారుల తీరు విశ్వవిద్యాలయ పురోగతికి ప్రతిబంధకంగా మారింది. చిన్న విషయాల పట్ల నిర్ణయం తీసు కోకుండా దాటవేసే ధోరణి, అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు పాలిట శాపంగా మారుతున్నాయి. విశ్వ విద్యాలయం అధికారుల తీరు రోత పుట్టిస్తున్నాయి. నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా విశ్వవిద్యాలయ అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఎప్పుడు ఏ సమస్య ముందుంచినా నేను ఇంచార్జి వీసీని కొద్దికాలం ఓపిక పట్టండి శాశ్వత విసి వస్తారు అని సెలవిస్తున్నారు. కానీ పేరుకే ఇంచార్జి వీసీ చేసేవన్నీ శాశ్వత వీసీ కంటే ఎక్కువగా చేస్తున్నారు. గత సంవత్సరం జరిగిన పదవుల పంపకాల్లో రెక్టార్‌గా ప్రొ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ గా నాన్ టీచింగ్ స్టాఫ్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ గా ఉన్న రమేష్ బాబు అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించారు. రిజిస్ట్రార్ తనకు ఐదు ఇంక్రిమెంట్లు తెచ్చుకున్నారు. యూజీసీ నిబంధనలు కేవలం అధ్యాపకులకు మాత్రమే వర్తిస్తుంది, ఈయన నాన్ టీచింగ్ స్టాఫ్. ఇప్పుడు మళ్ళీ తనకు రావలసిన ఆరియర్స్ అరవై లక్షల దాక రావాలని దస్త్రం పుట్టిస్తున్నారు. 2013,14 లో రీసర్చ్ స్కాలర్లు కరోనా కారణంగా 2022 లో పూర్తి



చేసుకోవడానికి వస్తే వారితో ఎక్స్టెన్షన్ ఫీజు నలభై వేలు కట్టించుకుని వారికి ఏ మాత్రం సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు, మరోవైపు ముప్పై సంవత్సరాల కిందట చేరిన వ్యక్తికి మొన్న జువాలజీ లో పీహెచ్డి ప్రధానం చేస్తారు. చదువుకున్న మేధావులు ఉన్న విశ్వ విద్యాల యంలో అర్జీ ఇస్తే అంతే సంగతి. వచ్చిన అర్జీలకు సమాధానం చెప్పరు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ప్రవర్తిస్తారు. కొన్ని విషయాలు నోరు మాట్లాడుతుంది నొసలు వెక్కిరిస్తుంది అన్న చందాన వ్యవహరిస్తుంటారు. ప్రతి విషయానికి దాటవేసే ధోరణి కనిపిస్తుంది. అన్ని విభాగాలు ఒక్కరి తో నడుపు తున్నారు. ఎకనా మిక్స్ విభాగంలో ఒకే ఒక్క ప్రొ ఫెసర్ బోధకుడు, డీన్, విభాగాధిపతి, రెక్టార్ అన్ని ఆయనే, ఇక మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ లో ఒకే ఒక్క ప్రొఫెసర్ ఆమె డీన్, ఆమె విభాగాధిపతి, రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్, ఇక జియాలజీ డిపార్ట్మెంట్ లో అదే పరిస్థితి ప్రిన్సిపాల్, డీన్, పాలకమండలి సభ్యురాలు ఇలా ప్రతి ఒక్కరూ నాలుగైదు భాద్యతలు తీసుకొని ఏది సక్రమంగా నిర్వహించలేక అన్నీ పెండింగ్ లో పెడుతున్నారు. 2022 లో పరిశోధన విద్యార్థులు ఎక్స్టెన్షన్ ఫీజు కట్టి విభాగంలో సినాప్సిస్ సబ్మిట్ చేయడానికి వెళితే అక్కడ గైడ్ సస్పెండ్ కావడం వలన అనుమతించలేదు. తర్వాత వస్తే టైం అయిపోయింది అని చెబుతున్నారు. 2021 నుంచి పరిశోధన గ్రంథాలు సమర్పించుకోవడం జరుగలేదు. విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి సమాధానం ఉండదు. 2011లో చేరిన విద్యార్థులు ఉపకులపతి కలువగా నేను కేవలం తా త్కాలిక ఉపకులపతి వచ్చే వీసీ చూసుకుంటారు అని సంవత్సరం నుంచి దాటవేసే ధోరణి. మీరు నా చుట్టూ ప్రదక్షిణ చేయకుండా వెళ్లి రీ రిజిస్ట్రేషన్ చేసుకుని మూడు నెలల్లో మీ థీసిస్ సబ్మిట్ చేసి కొమ్మని సెలవిచ్చారు. పరిశోధన విద్యార్థులు డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌ని కలువగా అది సాధ్యపడదు, మీరు ఆరు సెమిస్టర్లు వేచి ఉండాలి అదనంగా ఇంకో పరీక్ష రాయాలని సెలవిచ్చారు. ఏ ఒక్కరికీ అరకొర సమాచారం తప్ప పూర్తిగా విషయం అర్థం కాదు. మరొక విద్యార్థి డిస్కంటిన్యూ లెటర్ పంపించారు.

సకాలంలో పూర్తికాని విద్యార్థులతో ఫైన్ వసూలు చేసి డెడ్ లైన్ ఇస్తే సరిపోతుంది. దీనికి ఉన్నత విద్య కౌన్సిల్ నుంచి యూజీసీ నుంచి పర్మిషన్ అక్కర్లేదు. ఒకవేళ వారు ఏమైనా ప్రభుత్వం చెప్పింది ఏమైనా చేస్తున్నారు అంటే అది లేదు. అధికారుల మధ్య పాలకమండలి సభ్యుల మధ్య సమన్వయం లోపించి గోటితో పోయేదానికి గొడ్డలి పట్టుకు ంటున్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను పటి ష్టప రచడం, ఉపకులపతి నియామకాన్ని మరచిపోయి విశ్వ విద్యాలయాన్ని శాశ్వితంగా మూసివేసే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తుంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారు తక్షణమే దృష్టి పెట్టాలని విద్య పరిరక్షణ కన్వీనర్ డా. ముచ్చుకోట సురేష్ బాబు, ఆర్‌ఈఎఫ్ అధ్యక్షులు డా. రామచంద్ర తెలిపారు, మారాల్సింది అధికారుల పనితీరు మనుషులు కాదు.

### పోలీసుల సంక్షేమానికి

## చిత్తశుద్ధితో కృషి చేస్తా

**- శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ హామీ**



**పుట్టపర్తి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** పోలీసుల సంక్షేమంపై దృష్టి సారిస్తానని, వారికి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలియజేశారు. ఉమ్మడి జిల్లాల పోలీస్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ను ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. పోలీసుల సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెల్లారు. పోలీసుల పిల్లలకు విద్య పరంగా కూడా తన వంతు సహకారం అంది స్తానన్నారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి హోంగార్డు మొదలుకొని అన్ని క్యాడర్ల ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని వాటిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తనవంతుగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో పోలీస్ అధికారుల రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఉమ్మడి జిల్లాల పోలీస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు త్రిలోక్ నాథ్ గాండ్ల హరినాథ్, దాదా పీర్, సరోజమ్మ ఉన్నారు.


## డీలర్లకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**గాండ్లపెంట–సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం సి ఎస్ డి టి వాణిబాయి మండలంలోని చౌక ధాన్యపు డిపో డీలర్లకు స్మార్ట్ రేషన్ కార్డులనుఅందజేశారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 24 చౌక ధాన్యపు డిపోలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వం సరఫరా చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్లకు మండల వ్యాప్తంగా 24 డిపోలకు సంబంధించి దాదాపు 8,289 స్మార్ట్ కార్డులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. స్మార్ట్ కార్డులను ఒకటవ తారీకు లోపే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలియజేశారు. అదేవిధంగా ఈపాస్ విధానం గురించి డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు జాఫర్ వలి, వీఆర్వో చంద్రశేఖర్, మండలంలోని 24 మంది డీలర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### గుత్తి జక్కలచెరువు గ్రామంలో

## 'పొలం పిలుస్తుంది '



**గుత్తి –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** గుత్తి మండలంలోని జక్కల చెరువు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్ర మంలో అ నంతపురం జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జెడిఎ ఉమా మ హేశ్వరీ పాల్గొన్నారు. నాగరాజు రైతు పత్తి పొలంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, ప్రతి రైతు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచిం చారు. అలాగే పత్తి పంటలో తలెత్తే పురుగులు,తెగుళ్ల నివారణ మార్గాలు, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మండలానికి జిప్సమ్ 30 టన్నులు అందుబాటులో ఉన్నాయని, రైతులు దీనిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గుత్తి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎ డి ఎ వెంకటరాము డు,వ్యవసాయ అధికారిణి ఎ ఓ టెక్నికల్ శశికళ వ్యవసాయ అధి కారి ముస్తాక్ అహమ్మద్,వ్యవసా యశాఖ సిబ్బంది స్థానిక నాయకులు మరియు పలువురు రైతు లు పాల్గొన్నారు.

### అన్నపూర్ణ దేవి

## అలంకరణతో వాసవి మాత



**పామిడి–సూర్య వాస్తవం, సెప్టెంబర్23:** పామిడి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మంగళవారం అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం అర్చన చేశారు. మధ్యాహ్నం మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. రాత్రి "వాసవి సహస్ర నామ కుంకుమ అర్చన "వాసవి మాతృ మండలి వారు నిర్వహించారు. బాలలకు వాసవి మాత జీవిత చరిత్ర పై క్విజ్ నిర్వహించారు. వారికి బహుమతి ప్రధానం చేశారు. బాలల్లో అమ్మవారి త్యాగానిరతి పై అవగాహన పెంచి భక్తి మార్గం పెంపొందించేందుకు క్విజ్ ఏర్పాటు చేశామని మాతృ మండలి గౌరవఅధ్యక్షురాలు కె.రాజేశ్వరి, అధ్యక్షురాలు ఎన్వీఎస్ నాగవల్లి అన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో
# పీ4 శిక్షణా కార్యక్రమం



**గుత్తి -సూర్యవాస్తవం, సెప్టెంబర్ 23 :** గుత్తి అర్బన్ - గుత్తి మున్సిపల్ ఆఫీసులో కమీషనర్ బి. జబ్బార్ మియా ఆధ్వర్యంలో పి 4 శిక్షణా తరగతులు జరిగినవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అ త్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి 4 కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో గల ఆర్థికంగా సేవాభావంతో గల మా ర్గదర్శకుల వివరాలు,బంగారు కుటుంబాలు అయిన సహాయం కోసం ఎదురు చూస్తు న్న వారి వివరాలు సేకరించి ప్రభుత్వం మఱియు ప్రయివేట్ వ్యక్తుల అనుసంధానముతో పేదరికాన్ని రూపు మాపుటకు ప్రభుత్వం వారు సంకల్పించిన సూచనల ప్రకారం పి4కు సం బంధించిన విధివిధానాలు, కార్యక్రమ నిర్వహణపై గురించిన మాస్టర్ ట్రైనర్లతో సచి వాలయ సిబ్బందికి మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ కా ర్యక్రమం జరిగినది. కమీషనర్ బి.జబ్బార్ మియా.ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

# వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి



**డోన్ -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 23:** విజయవాడ లోని ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ హెడ్ ఆఫీస్ నందు ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ “47వ, 48వ వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశము” కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఈ కార్యక్రమంలో ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ , డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్.ఢిల్లిరావు ఐఏఎస్ ,ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చిల్లా జగదీశ్వరి ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఫైనాన్షియర్ అడ్వైజర్ సురేంద్ర, ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ షేర్ హోల్డర్స్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# పోషకాహారంతోనే ఆరోగ్య భాగ్యం

### - ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కురుబ హేమలత

**అనంతపురం టౌన్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కురుబ హేమలత అన్నారు.



అనంతపురం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషణ్ మహ్ కార్యక్రమానికి సీడీపీఓ అనూరాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ హేమ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టిన, పుట్టబోయే బిడ్డలు మంచి ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి ఆహారం తీసుకోవాలో చక్కగా వివరించారు. అందుబాటులో దొరికే పండ్లు, కూరగాయలు, ఇతర పోషక పదార్థాల గురించి, వాటి ప్రాధాన్యం గురించి తెలిపారు. ఏయే వయస్సులో ఎటువంటి ఆహారం తీసుకోవాలో కూడా వివరించారు. అనంతరం పోషక పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మరో సూపర్ వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు యశోద, రామాయణం, నారాయణమ్మ పాల్గొన్నారు.

# నిరుపేదలకు నిత్యవసర సరుకులు



**గోరంట్ల- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** పుట్టపర్తి, గోరంట్ల మండలాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దేవంగం జగదీష్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను మంగళవారం అందజేశారు. పుట్టపర్తి ప్రశాంతి గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జగదీష్ గోరంట్ల, పుట్టపర్తి.మండలంలో మానసిక వికలాంగులకు, ఒంటరి మహిళలకు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే 35 మందిని గుర్తించి వారికి వారి ఇళ్ల వద్దకే వెళ్లి నిత్యవసర సరుకులు అందజేశారు. వాటిలో గోధుమపిండి బెల్లం ఉప్మా రవ్వ చక్కెర తదితర వస్తువులతో కూడిన కిట్టు ను దసరా పండుగ సందర్భంగా నిత్యవసర సరుకులను అందజేస్తూ తమ వంతు సాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సరుకులు అందుకున్న మహిళలు దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు.

## జాతీయ రహదారి, పారిశ్రామిక, సోలార్ ప్రాజెక్టుల
# భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### - చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో లక్ష్యం దిశగా ప్రగతి సాధించాలి: జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



**పుట్టపర్తి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులు, పారిశ్రామిక మరియు సోలార్ ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సంబందిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో... జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులు, సోలార్, ఏపిఐఐసి ప్రాజెక్ట్స్ కు సంబంధించి భూసేకరణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భారతమాల పరియోజన ఫేజ్ - 1 లో భాగంగా... బెంగళూరు- కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో జిల్లాలోని కోడూరు నుండి ఒద్దులపల్లి వరకు ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే అభివృద్ధిపై సమగ్రంగా సమీక్షించారు. ఇందుకు సంబంధించి ఇంకనూ 80 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సిన అవసరం ఉందని దానిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆయా అంశాలకు సంబంధించి సాధించాల్సిన లక్ష్యం, ఇప్పటివరకు సాధించింది ఎంత, మిగులు ఎంత, పెండింగ్ ఉండడానికి గల కారణాలు, కోర్టు కేసులు ఇతరత్ర సమస్యలు ఏమైనా ఉన్నాయా, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు, ఎన్ హెచ్ 342 ప్యాకేజ్- 1లో ముదిగుబ్బ బైపాస్ 1.78 కి.మీ రోడ్డు పనులు, బుచ్చయ్యగారి పల్లి గ్రామంలో పరిహార ఆర్బిట్రేషన్ సమస్యలు, గరుగుతండా- గుంజేపల్లి గ్రామాల్లో సర్వీస్ రోడ్డు భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాలకు అప్రోచ్ రోడ్లు అవసరం ఉంటే వాటిని నిర్మించాల్సిందిగా ఎన్హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ను ఆదేశించారు,అలాగే ప్యాకేజ్-2లో శెట్టిపల్లి అనెక్సర్స్ మూడు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. టోల్ ప్లాజా నిర్మాణం కొరకు ఇంకనూ అవసరమైన 18.92 ఎకరాల భూసమస్యను రైతుల అంగీకారంతో ఒక నెలలో పరిష్కరించాలని, గుమ్మయ్యగారి పల్లి గ్రామంలోని బోర్‌వెల్ సప్లిమెంటరీ అవార్డు వారంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు, బెంగళూరు-కడప - విజయవాడ కారిడార్ (బి కే వి) లో 80.49 హెక్టార్ల భూమిపై కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి వెంటనే కౌంటర్లు దాఖలు చేయాలని సూచించారు. మలకవేమల, గోవునివారి పల్లి గ్రామాల అనెక్సర్స్ మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సివిల్ వివాదాలు ఉన్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత తాసిల్దార్లకు సూచించారు, ఎన్హెచ్ 716జి ప్రాజెక్టు కు సంబంధించి ఇంకనూ 37 ఎకరాల అనెక్సర్స్ పెండింగ్‌లో ఉన్నాయని వాటి త్వరగా పూర్తి చేయాలని, పులగంపల్లి గ్రామ రోడ్డు సమస్యను ఒక వారంలో పరిష్కరించాలని ఆదేశించారు. గొరంట్ల మండలంలో 25 ఎకరాలు, హిందూపురం తహసీల్దార్ పరిధిలో 17 ఎకరాల అనెక్సర్స్ 15 రోజుల్లో క్లియర్ చేయాలని చెప్పారు. కూటగుల్ల గ్రామంలో పవర్ గ్రిడ్ టవర్స్ షిఫ్టింగ్‌పై రైతులతో చర్చించి అంగీకారం తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు, ఎన్హెచ్ 44లో విద్యుత్ లైన్ షిఫ్టింగ్ అంచనాలను రెండు రోజుల్లో సమర్పించాలని ఎస్పీడీసీఎల్ వారిని, ధర్మవరం పట్టణం కదిరి గేట్ వద్ద భూమిపై పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు, ఏపీఐఐసీ పరిధిలో టెకులోడు గ్రామంలో 88 ఎకరాల భూమి రిక్విజిషన్ ఫైల్ పంపించాలని, జిల్లాలోని 28వేల ఎకరాల పారిశ్రామిక భూమిని ఫీల్డ్ లెవెల్లో పరిశీలించి వర్గీకరించాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. 6 ఏం ఏస్ ఎం ఈ పార్కులు సిద్ధంగా ఉండగా ధర్మవరం పార్కు మాత్రమే పెండింగ్‌లో ఉందని కలెక్టర్ తెలిపారు, నెడ్ క్యాప్ పరిధిలో రామగిరి సోలార్ పార్క్ ప్రారంభోత్సవం త్వరలో భారత ప్రధానిచే వర్చువల్ గా ప్రారంభించే అవకాశం ఉందన్నారు. పిఎం కుసుం పథకంలో 20 సబ్‌స్టేషన్లు, 150 ఫీడర్లు గుర్తించబడ్డాయని చెప్పారు, తహసీల్దార్లు మండల స్థాయి ప్రజా సమస్యలను తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ఏవైనా గుర్తించిన ఆక్రమణలను పోలీసులు సహకారంతో తొలగించాలని కలెక్టర్ స్పష్టంగా తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో నెలకు ఒక రోజు గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలని, శ్మశానవాటికల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు, ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ ఇంకా, ఆనంద్ కుమార్, ఎన్ హెచ్, ఏపీఐఐసీ, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరిస్తా

- శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ హామీ
- ఎస్పీని కలిసిన మహిళా పోలీసులు
- ఎస్పీ దంపతులకు శాలువ కప్పి, పూలమాలతో సత్కారం



**పుట్టపర్తి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు వారు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా సుహృద్భావ వాతావరణం కల్పిస్తామని శ్రీ సత్యసాయి జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ సతీశ్ కుమార్ హామీ ఇచ్చారు. ఎస్పీగా బదిలీపై వచ్చిన సతీశ్ కుమార్ ను పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలోని ఛాంబర్ లో ఎస్పీ సతీశ్ కుమార్ దంపతులను మహిళా పోలీసుల అసోసియేషన్ రాయలసీమ జిల్లాల అధ్యక్షురాలు అమడగూరు భవాని(ఓ.డి.చెరువు) నాయకత్వంలో మహిళా పోలీసుల ప్రతినిధులు రాజేశ్వరి, కృష్ణ, వేణి, అనసూయ, మాధవీలత, ప్రజ్ఞ, మాధవి తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువ కప్పి సత్కరించారు. అనంతరం వారితో ఎస్పీ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మహిళా పోలీసులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ, సీ.ఐ, ఎస్.ఐ స్థాయి అధికారుల సహకారం ఎలా ఉందని ఆరా తీశారు. తమ సమస్యలను ఎస్పీ దృష్టికి భవాని తెచ్చారు. వాటిని పరిష్కరించాలని కోరారు. అందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మహిళా పోలీసులతో డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యలు తీసుకు ంటానని తెలిపారు. ఆ తరువాత వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు మహిళా పోలీసులకు ఐసీడీఎస్, పోలీస్ శాఖల్లో ఏదో ఒక శాఖలో కొనసాగేలా తమకు ఆప్షన్ ఇవ్వడం బాగుందని, అందుకు ప్రభుత్వంతో పాటు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఒకవేళ పోలీస్ శాఖలోనే కొనసాగాలనుకునే వారికి పదోన్నతులు కల్పించి వారికి సహకరించాలని కోరారు. అందుకు ఎస్పీ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరిస్తానని, పాలసీ మ్యాటర్‌కు సంబంధించిన అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని కూడా స్పష్టం చేశారు.

# కార్మికుల రుణం తీర్చుకోలేనిది...

### -కార్మికుల సేవలు అభినందనీయం
### - దసరా పండుగ కానుకగా కార్మికులకు బట్టలు నిత్యావసర సరుకుల పంపిణీ



**గోరంట్ల- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడటానికి ఎంత కష్టమైనా ఎంత దుర్వాసన వస్తున్న పరిసరాల పరిశుభ్రత డ్రైనేజీలా శుభ్రత చేస్తున్నారని వారి రుణం తీర్చుకోలేనిదని వక్తలు పిలుపునిచ్చారు.గోరంట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రతి ఏడాది ఆనవాయితీగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులకు దసరా పండుగ కానుకగా ఇస్తున్న బట్టలు నిత్యవసర సరుకులు చెప్పులు పంపిణీ సందర్భంగా కార్మికుల సేవలను కొనియాడారు, తెల్లవారుజాము నుండి పట్టణ పరిశుభ్రతలో పంచాయతీ కార్మికులు నిమగ్నమవుతారని తెలిపారు, అనంతరం గ్రామపంచాయతీ లోని పారిశుధ్య స్వచ్ఛభారత్ తో పాటు మొత్తం 80 మంది సిబ్బందికి బట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాబాయి, మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి,మాజీ సర్పంచ్ నరేష్,మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి,మండల బీజేపీ అధ్యక్షుడు బోయ లక్ష్మీ నారాయణ, బొట్టు శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, జనసేన సంతోష్, మండల టిడిపి నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్, పచ్చ అశోక్,షేక్ అజ్మతుల్లా, నాగే నాయక్, డైరెక్టర్ నబీరసూల్, వార్డు సభ్యులు సుబహాన్, గంగం పల్లి సుబహన్,రాజారెడ్డి, పద్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, సంజయ్ కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సారూ... కాస్త పట్టించుకోండి

**- వర్షం వచ్చినప్పుడు వచ్చారు.. డ్రైనేజ్ పనులు మరిచారు**
**- మళ్లీ వర్షం రావాలా.. ప్రాణాలు పోవాలా?**
**- అంతవరకు పట్టించుకోరా అంటున్న కొత్తపేట రామాపురం ప్రజలు**




**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23 :** అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గం రాయచోటిలో గత కొన్ని రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి రాయచోటిలో సుమారు నాలుగు ప్రాణాలు కోల్పోవడం అందరికీ తెలిసిన విషయమే ఎందుకు సంబంధించి రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో మురికి కాలువలో పడి ఓ బాలిక మృతి చెందగా గుండిగుంట రోడ్డు సమీపంలోని మురికి కాలువలో మరో ముగ్గురు పడి మృతి చెందడం జరిగింది. ఆరోజు రాత్రి 7 నుంచి 12 గంటల వరకు వర్షం ఏగతాదిగా కొరయడంతో రాయచోటి ప్రాంతంలోని అలుచోట్ల ఉన్న మున్సిపల్ డ్రైనేజీ లోని మురికి నీరంతా ఒక్కసారిగా కొత్తపేట రామాపురం లో చేరుకొని అక్కడ ఉన్న దుకాణాల్లోకి చొరబడి మురికి కాలువలు కొట్టుకుపోవడంతో పాటు పూర్తిస్థాయిలో డ్యామేజీ కావడం జరిగింది దీంతో ఆ ప్రాంతంలోని చాలామంది నివాసులు మురికి కాలువ పైన ఇల్లు కట్టుకున్నారని కాలుపై కట్టుకున్న వారిని ఎలాగైనా తొలగిస్తామని ఆరోజు చెప్పిన జిల్లా స్థాయి అధికారులతో సహా నేటికీ ఎవరు కనిపించడం లేదని దీంతో ఆ ప్రాంతంలోనే డ్రైనేజీ పనులు జరగకపోవడంతో ఇక్కడ వేసిన గొంగడి అక్కడే లాగా ఆ డ్యామేజ్ అయిన కల్వర్టును నిత్యం వచ్చి పోయే ప్రజలు ఎగ్జిబిషన్ లా చూస్తూ వెళుతున్నారు. అసలే వర్షాకాలం మున్సిపల్ అధికారులు కానీ జిల్లాది స్థాయి అధికారులు కానీ పట్టించుకోక పోతే వర్షాలు వచ్చినప్పుడు మరెన్నో ప్రాణాలు పోయే సూచనలు కూడా ఉన్నాయని ఉన్న మురికి కాలువలు కూడా అంతంత మాత్రమే ఉండడంతో పలు వీధులలోనే మురికి కాలువలో తెలిసి ఉండడమే కాకుండా వర్షం నీరు వచ్చినప్పుడు పాదచారులు ఏదో ఒకచోట మురికి కాలువలో పడి కొట్టుకొని పోయే ప్రమాదం కూడా ఉందని అక్కడికి చేసిన పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు గమనించినప్పటికీ నేటికీ దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై పలువురు పలు విధాలుగా చర్చించు కుంటున్నారు రోడ్డుపై ఉన్న ఈ డ్యామేజీ అయినా మురికి కాలువను వెంటనే పట్టించుకోని మరమ్మ తులు చేసి మున్సి పాలిటీ కాలువను ఎవరు ఆక్రమించుకోకుండా కాలువను నూతనంగా నిర్మించి నట్లయితే ఆ ప్రాంతంలోని వాసులకు ప్రాణాల నుండి కాపాడిన వారు అవుతారని అదేవిధంగా ఆ మురికి కాలువ ఆక్రమణకు గురి కాకుండా ఉంటుందని ఆ ప్రాంతంలోని పలువురు కోరుతున్నారు.




**త్వరలోనే మున్సిపల్ డ్రైనేజీ పనులు చేపడతాం ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం:**

మున్సిపల్ కమిషనర్ జి రవి ఇటీవల కురిసిన వర్షాలకు రాయిచోటిలోని కొత్తపేట రామపురంలో దెబ్బతిన్న ఊరికి కాలువ పనులు త్వరలోనే చేపడుతామని జిల్లా పన్నుతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జి రవి అన్నారు.



మున్సిపల్ డ్రైనేజీ కాలువ పైన ఉన్నటువంటి ఆక్రమణ ను తొలగించి తర్వాత పనులు చేపడతామని ఆయన అన్నారు. అధికారుల ఆదేశాలు వచ్చేవరకు కాస్త సమయం పడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# శిశువుల సౌభాగ్యానికి తల్లిపాలే శ్రీరామ రక్ష

**- అనంతపురం సర్వజనాస్పత్రి డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత**
**- అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు 45 లీటర్ల పాలు ఇచ్చిన మాతృమూర్తికి అభినందన**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** తల్లిపాలు తాగే శిశువులు పండంటి ఆరోగ్యంగా ఉంటారని, సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని, అందుకే తల్లిపాలు శిశువుల సౌభాగ్యానికి శ్రీరామ రక్షగా అభివర్ణించారు అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత. తల్లిపాలు తాగే శిశువులు తెలివిగా కూడా ఉంటారనీ కూడా ఆమె పేర్కొన్నారు. బిడ్డ బంగారు భవిష్యత్తుకు సాయపడే తల్లిపాలలో సహజంగానే జ్ఞాపకశక్తి దాగి ఉంటుందని, ఇది ప్రకృతి చేసే అద్భుతమని స్పష్టం చేశారు. అనంతపురం పెద్దాసుపత్రిలో కొత్తగా ప్రారంభించిన అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు బెంగళూరులోని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా శాఖలో ఎలక్ట్రికల్ మేనేజర్ గా పని చేసే దర్శి లిఖిత 45 లీటర్ల పాలు ఇవ్వగా.. ఆ మాతృమూర్తిని మంగళవారం సన్మానించారు. ఈ



సందర్భంగా డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ అనంతపురానికి చెందిన దర్శి లిఖిత ఈ ఏడాది ఏప్రిల్ 30న మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. లిఖిత తన బిడ్డకు పాలు ఇవ్వగా మిగిలిన పాలను సేకరించి, వాటిని భద్రపరిచి తమ మిల్క్ బ్యాంక్ కు దానం చేసి తన మాతృత్వాన్ని చేసుకున్నారని, అందుకు లిఖితను డాక్టర్ అభినందించారు. నెలలు నిండకుండా పుట్టిన, తక్కువ బరువుతో పుట్టిన, ఆరోగ్య సమస్యలతో పుట్టిన, కవల పిల్లలు, అనారోగ్య కారణాలతో పాలు ఇవ్వలేని తల్లులకు పుట్టిన శిశువులకు నవజాత కేంద్రంలో అడ్మిట్ చేస్తారని వివరించారు. ఇలాంటి శిశువులకు సేకరించి, సురక్షితంగా భద్రపరచిన తల్లిపాలను ఇచ్చి శిశువుల సౌభాగ్యానికి దోహదపడటం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు న్యూట్రిషన్ బోయ సాయిపల్లవి తెలిపారు. అనంతరం 45 లీటర్ల పాలను దానం చేసిన దర్శి లిఖితను తల్లులు, సిబ్బందితో కలసి సత్కరించారు.

ఆమె రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో ప్రతి తల్లి ముందుకొచ్చి పలు దానం చేసి తమ మాతృత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, కౌన్సిలర్ డా.రాధ, స్టాఫ్ నర్సులు బోయ సుకన్య, రమ, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## గొడవలకు దూరంగా ఉండండి ప్రశాంతంగా జీవించండి

**- ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్**



**పుట్టపర్తి-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** గొడవలకు దూరంగా ఉంటూ అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్ సూచించారు, శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు.. మంగళవారం రాత్రి ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, రామగిరి సర్కిల్ సీఐ శ్రీధర్ , సి.కే.పల్లి కనగానపల్లి ఎస్సైలు రిజ్వాన్, సత్యనారాయణ లతో కలిసి, సి.కే.పల్లి మండలంలోని హరియాన్ చెరువు గ్రామంలో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా మహిళలు బాలికలపై జరిగే నేరాలు, ఎస్సీ,ఎస్టీ చట్టాలు మరియు బాల్యవివాహాలు, సైబర్ నేరాలు వంటి ముఖ్య అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నేరాలు నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారని అందులో భాగంగా ప్రజల కూడా మీ మీ గ్రామాలలో ఎక్కడైనా ఏ సమస్యలు ఉన్న ,అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డిఎస్పీ తెలియజేశారు. ఈ గ్రామ సభలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

**-ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ**



**నాయుడుపేట -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. సూళ్లూరుపేట నియోజ కవర్గంలో ఆరోగ్య సేవలను విస్తృతం చేయాలని కోరారు. పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, 25 లక్షల బీమా సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో 15 పీహెచ్సీలు రెండు సీ సిహెచ్సిలు ఉన్నట్లు తెలియజేశారు.ప్రభుత్వ ఆసుపత్రిల్లో మౌలిక వసతలను మెరుగుపరచడం తోపాటు అవసరమైన చోట డాక్టర్లు,సిబ్బందిని నియమించాలని కోరారు.జాతీయ రహదారి సమీపంలో కూడలి ప్రాంతమైన నాయుడుపేట పట్టణంలో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

## నింగి నుంచి డ్రోన్లతో నిఘా....

**- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి**




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిల్లో ఆయా పోలీసులు డ్రోన్లు ఎగురవేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి అనంతపురం టూటౌన్, ఫోర్త్ టౌన్ , గుత్తి, కళ్యాణదుర్గం, తదితర పోలీసు స్టేషన్ల పరిధిల్లో డ్రోన్లతో నిఘా వేశారు. ఈ డ్రోన్స్ ద్వారా లా అండ్ ఆర్డర్, నేరాల నియంత్రణ, రద్దీగా ఉండే జంక్షన్లు పర్యవేక్షించడం ద్వారా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ట్రాఫిక్ నిర్వహణకు, దొంగల్ని గుర్తించడం, పారిపోతున్న వారిని ఛేజ్ చేయడం, పలు బందోబస్తులు, బహిరంగ సభలు, జాతరలు/ఊరేగింపు సమయంలో జన సమూహాన్ని పర్యవేక్షించడం ద్వారా క్రౌడ్ మేనేజ్మెంట్ లో భాగంగా అవాంఛనీయ సంఘటనలు నిలువరించుటలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అమ్మాయిలను ఈవ్ టీజ్ చేయడం, ఒంటరిగా వెళ్లే మహిళలు కావచ్చు లేదా వ్యక్తులునైనా బెదిరించడం, చైన్ స్నాచింగ్, చోరీలు వంటి నేరాలకు పాల్పడే వారికి డ్రోన్లతో చెక్ పెడుతున్నారు. హైవేలపై బైక్ రేసులు అరికట్టుట, డ్రగ్స్ విక్రయం/సేవించడం, మారుమూల ప్రాంతాల్లో నాటుసారా తయారీ, పేకాట స్థావరాలు, శివార్లలో ఓపెన్ డ్రింకింగ్ చేసి న్యూసెన్స్ క్రియేట్ చేయడం వంటి చట్టవ్యతిరేక/అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి వాటిని నియంత్రించడంలో చర్యలు తీసుకోవడం జరుగుతోంది. కొన్ని సందర్భాలలో పోలీసులు భౌతికంగా వెళ్లలేని ప్రదేశాలకు డ్రోన్లను పంపి అక్కడి పరిస్థితులను సమీక్షించుకునే వీలుగా పోలీసులు కృషి చేస్తున్నారు.

## నేడు విద్యుత్తులో అంతరాయం

**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం ,సెప్టెంబర్ 23 :** నేడు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతుందని ఏపీ ఎస్పీడీసీఎల్ ఏ ఈ ఓ ప్రకటనలో తెలిపారు. 132 కె.వి.ఎస్‌లోబ్రేకర్ మరమ్మత్తులు చేస్తున్న కార ణంగా లక్కిరెడ్డిపల్లి మం డలంలో సప్లై నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 23 :** నిమ్మనపల్లె మండలంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడని ఎస్సై తిప్పేస్వామి తెలిపారు. ఆ వివరాలు.. అన్నమయ్య జిల్లా, మదనపల్లి నియోజకవర్గంలోని నిమ్మనపల్లి మండలం, చౌకిళ్లవారిపల్లిలో ఉండే వెంకటరమణ (56) కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపం చెందాడు. దీంతో పశువులకు పిడుదులు రాకుండా ఉండేందుకు వాడే పురుగుల మందును సోమవారం రాత్రి తాగి ఆత్మ హత్యకు యత్ని ంచాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆయన్ను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్యం అందిస్తుండగా మంగళవారం ఉదయం వెంకటరమణ చెందాడని ఎస్ఐ తెలిపారు.

## ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 23 :** మదనపల్లె మండలంలో ఓ యువకుడు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కోవ డం వెలుగు చూసింది. ఘటనపై మదనపల్లి తాలూ కా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. వేంపల్లికి చెందిన లేట్ శంకర, హేమా వతి ల కుమారుడు ఎం.హిమగిరి(16) ఇంటర్ వరకు చదివాడు. తండ్రి చని పోవడంతో మధ్యలోనే చదువు ఆపేశాడు. మదనపల్లె లోని ఓ స్కూటర్ మెకానిక్ షెడ్‌లో మెకానిక్ వర్క్ నేర్చుకుంటూ ఉన్నాడు. ఇంతలో హిమగిరికి ఏ కష్టం వచ్చిందో ఏమో.. తను ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి తాలూక పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహానికి పంచిన నిర్వహించి పోస్టుమార్టం కోసం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## కోడిపందెం రాయళ్లు అరెస్ట్

**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, ఐపియస్ ఉత్తర్వుల మేరకు రాయచోటి అర్బన్ పియస్ఇన్స్పెక్టర్ బి.వి. చలపతి ఆధ్వర్యంలో ఎస్సైలు జహీర్, బాలకృష్ణ ,ట సిబ్బందితో దిగువ అబ్బవరం హరిజనవాడ సమీపంలో కోడిపందాలపై డ్రోన్ సహకారంతో దాడులు నిర్వహించి 12 మంది ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 25 వేల రూపాయలు నగదు 26 మోటర్ సైకిల్ లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. కొంతమంది పారిపోవడం జరిగింది వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడును.



# త్వరలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు

- జగన్ బీసీల ద్రోహి : మంత్రి సవిత మండిపాటు
- మంత్రి సవితను ఘనంగా సత్కరించిన కార్పొరేషన్ చైర్మన్లు



**శ్రీ సత్య సాయి బ్యూరో– సూర్య వాస్తవం, ఆగస్టు 23:** జనాభా దామాషా పద్ధతిలో బీసీలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికనుగుణంగా బీసీ యువతకు కూడా ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వరించిన నేపథ్యంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వివిధ బీసీ సంక్షేమ సంఘాల కార్పొరేషన్ చైర్మన్లు తెలుగు నాడు వయోజన విద్యా సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ యాదవ్ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, అన్ని రంగాల్లో వెనుబడి ఉన్న బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం అన్న ఎన్టీఆర్ టీడీపీ స్థాపించారన్నారు. ఆయన బాటలో నడుస్తున్న సీఎం చంద్రబాబు కూడా బీసీల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ పోటీ పరీక్షల నిమిత్తం బీసీ నిరుద్యోగ యువతకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందజేశామన్నారు. సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షకు కూడా ఉచిత శిక్షణ అందజేశామన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేసిన ఉచిత శిక్షణకు గానూ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించిందన్నారు. త్వరలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు జనాభా దామాషా పద్ధతి ప్రకారం వెనుకబడిన తరగతులకు స్వయం ఉపాధి యూనిట్లు కేటాయించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఇటీవల జరిగిన బీసీ మంత్రుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, ఇదే విషయం సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు.

**ఏటా ఉచిత డీఎస్సీ కోచింగ్:** ఏటా డీఎస్సీ నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. డీఎస్సీకి సిద్ధమయ్యే బీసీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందజేయ నున్నామన్నారు. ఇందుకోసం ప్రణాళికులు సైతం సిద్ధం చేశామన్నారు. అన్ని పోటీ పరీక్షలకు కూడా ఉచిత శిక్షణ అందజేయాలని నిర్ణయించామన్నారు. అమరావతిలో అయిదు ఎకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ భవనం నిర్మించనున్నామన్నారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళదాం..** సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చుతున్నారని మంత్రి సవిత వెల్లడించారు. తల్లికి వందనం, పెన్షన్ల పెంపు, ఉచితంగా మూడు సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత ఇసుక అందజే స్తున్నామన్నారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. బీసీల అభ్యున్నతికి అందజేసే పథకాలపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధించగలమన్నారు.

**బీసీ ద్రోహి జగన్ :** అయిదేళ్ల పాలనలో జగన్ అసమర్థ నిర్ణయాల కారణంగా ఎక్కువగా నష్టపోయింది బీసీలేనని మంత్రి సవిత వెల్లడించారు. బీసీలను జగన్ ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాడన్నారు. బీసీల ద్రోహి జగన్ అని మంత్రి సవిత మండిపడ్డారు. బీసీల ఆత్మగౌరవం కోసం బీసీ రక్షణ యాక్ట్ రూపొందిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం మేర రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను

# సందర్శించిన "వృత్తి "బృందం సభ్యులు





**ప్యాపిలి-సూర్య వాస్తవం,సెప్టెంబర్ 23:** ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై లోతైన అవగాహన కోసం కర్నాటక రాష్ట్రం, బెంగుళూరు సిటీ, "వృత్తి " సంస్థ నుండి వచ్చినటువంటి నలుగురు (4 )సభ్యులతో కూడిన బృందం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలో మంగళవారం పర్యటించారు. "వృత్తి " అనేది గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్థిరత్వం, స్వయం సమృద్ధి మరియు జీవన ప్రమాణాల మెరుగుదల కోసం కృషి చేసే సంస్థ. ఈ సంస్థ గ్రామీణ కుటుంబాలకు వివిధ ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, వ్యవసాయం మరియు వ్యవసాయ ఆధారిత ప్రోత్సాహక చర్యలు, మరియు మార్కెట్ లింకేజీలు అందిస్తూ, ప్రధానంగా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, యువత, మహిళలను బలోపేతం చేసి, స్థిరమైన ఆదాయం, మరియు గౌరవప్రదమైన జీవన విధానం సాధించడానికి దోహదపడుతుంది. "వృత్తి " కృషి వలన అనేక కుటుంబాలు శాశ్వత జీవనోపాధి అవ కాశాలు పొందుతూ ఆర్థిక భద్రతను అందుకుం టు న్నాయి. ఈ క్షేత్ర సందర్శనలో భాగంగా ఏడీపీఎం అబ్దుల్ సలాం గారి నేతృత్వంలో "వృత్తి " బృందం నంద్యాల ప్యాపిలి మండలంలోని పలు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ఇక్కడి రైతులు అనుసరిస్తున్న వినూత్న పద్ధతులను తెలుసుకున్నారు. ముందుగా ప్యాపిలి మండలం, బావిపల్లి, నేరెడుచెర్ల యూనిట్లకు చెందిన ఐసీఆర్పీలు కలిసి సాగు చేస్తున్నటువంటి ఏటియం (ఎనీ టైం మనీ) మోడల్ ను పరిశీలించారు. 1.20 ఎకరాల విస్తీర్ణంలో 18 రకాల పంటల వైవిధ్యంతో సాగు చేస్తున్న విధానాలను వారు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన తొమ్మిది సార్వత్రిక సూత్రాలను రైతు ఎలా అనుసరిస్తున్నారో, పంటల ఎంపికలో ఆయన అనుసరించిన పద్ధతులను బృందం సభ్యులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. పంటల వైవిధ్యాన్ని, దాని ద్వారా సాధిస్తున్న విజయాలను బృందం ఎంతగానో మెచ్చుకుంది. ఆ తర్వాత అదే గ్రామంలో జలదుర్గం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జ్ వెంకటప్ప సాగు చేస్తున్న %ూ%-గ్రేడ్ కంది పంటను బృందం వీక్షించింది. వెంకటప్ప అనుసరిస్తున్న అంతర పంటలు, సరిహద్దు పంటల ప్రయోజనాలను బృందం సభ్యులు అడిగి తెలు సుకున్నారు. ఈ పద్ధతుల ద్వారా అదనపు ఆదాయాన్ని ఎలా పొందుతున్నారో రైతు వివరించారు. పలు పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం సాధ్య మవుతుందని బృందం అభిప్రాయపడింది. తదుపరి, జలదుర్గం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో వృత్తి సభ్యుల బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం వల్ల తమ కుటుంబ ఆరోగ్యం మెరుగుపడిందని, తక్కువ ఖర్చుతో పంట దిగుబడులు సాధ్యమయ్యాయని వారు వివ రించారు. అలాగే గృహోపయోగానికి అవసరమైన కూరగాయలను తాము స్వయంగా పండించుకోవడం వల్ల ఖర్చు తగ్గిందని, ఆదాయం కూడా పెరిగిందని తెలిపారు. తరువాత క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నటువంటి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వృత్తి బృందం, కేడర్ సభ్యులు తమ బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తున్నారో, రైతులతో వారు ఎంత సమీపంగా పని చేస్తున్నారు, శిక్షణలు ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. మరీ ముఖ్యంగా ఈ కార్యక్రమంలో భాగంగా బయో రిసోర్స్ సెంటర్ యజమాని రాశి పోగుల సుధాకర్ తో సెంటర్ యొక్క నిర్వహణ తయారు చేయు కషాయాలు, ద్రావణాలు మరియు గ్రోత్ ప్రమోటర్స్ మొదలగు ఇన్పుట్స్ ను రైతులకు ఏ విధంగా చేరవేస్తున్నారు, అలాగే రైతుల యొక్క స్పందన ఏ విధంగా ఉన్నది అనే వివరాలను అదేవిధంగా ఖర్చుల నిర్వహణ రిజిస్టర్లు ఏ విధంగా నిర్వహిస్తున్నది అడిగి తెలుసుకోవడం జరిగింది. రాబోవు రోజుల్లో బిఆర్సి సెంటర్లకు మంచి భవిష్యత్తు ఉన్నదని సుధాకర్ ఈ సందర్భంగా వృత్తి బృందం సభ్యులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వృత్తి బృందం సభ్యులు రాగిణి, రఘు, సందీప్, శరత్ లతో పాటు రైతు సాధికార సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ జలాలుద్దీన్, ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ సలాం , యం.యం.టి.యల్ భీమేష్, ఎన్.ఎఫ్.ఎ సునంద , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యమ్.టి లు, యూనిట్ ఇన్చార్జ్ లు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన ప్రాణాపాయం

### -ప్రయాణికులు క్షేమం



**పెళ్ళకూరు– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం దిగు చావాలి హైవేపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన నిలిపివున్న ప్రైవేట్ బస్సును వెనుకనుంచి వస్తున్న మరో ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, అదృష్టవశాత్తూ ప్రయాణికులు ఎవరూ ప్రాణాపాయానికి గురికాలేదు. గాయపడిన డ్రైవర్‌ను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



**నాయుడుపేట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నువ్వు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తోపాటుగా టిడిపి యువనేత నెలవల రాజేష్ నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపిక లను అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరారు. నాయుడుపేట పట్టణంలో గత అనేక సంవత్సరాలుగా 300 మంది కార్మికులు మెకానిక్ పనులపై ఆధారపడి జీవిస్తున్నారని సీఎంకు వివరించారు. 2024ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు కు వినతి పత్రం అందజేశారు.సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని వారు తెలియజేశారు.

## ఉల్లి కిలో రూ.2 మాత్రమే



**కర్నూలు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** జిల్లాలో ఉల్లి రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. రైతుల కష్టాలు తీర్చేందుకు మార్కెట్ ఫెడ్ ద్వారా క్వింటాల్ ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేస్తోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్లో 45 కేజీల ఉల్లిపాయల సంచిని రూ.100కు ఇస్తుండటంతో కిలో ఉల్లిపాయలు రూ.2కే వస్తోంది. హెక్టారుకు రూ.50 వేల నష్టపరిహారం కూడా ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నాయుడుపేట శ్రీ పోలేరమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు


### -శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ దర్శనం



**నాయుడుపేట – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** నాయుడుపేట గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ ఆలయంలో విజయదశమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంగళవారం శ్రీ పోలేరమ్మ అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ కోర్కెలు తీర్చమని వేడుకొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## డెలివరీ బాయ్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. మృతిచెందిన వ్యక్తి






**పెళ్లకూరు– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి శ్రీరామ్ నగర్ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు.స్థానికుల సమాచారం ప్రకారం, పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామానికి చెందిన మునిరెడ్డి గత 12 ఏళ్లుగా శ్రీకాళహస్తిలో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఫుడ్ డెలివరీ చేయడానికి వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతన్ని ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.ఈ ఘటనపై స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిడిమామిడిలో 1438 నాటి 'రాజగురువు' శాసనం



**పుట్టపర్తి-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** పుట్టపర్తి మండలం లోని నిడిమామిడిలోగల(శ్రీశైల జగద్గురు నిడుమామిడి సంస్థానం'లో బసవన్న (నంది) విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అంశాన్ని తెలుపుతున్న శాసనాన్ని గుర్తించినట్టు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. నిడిమామిడి వీర భద్రాలయం పక్కనే ఉన్న శ్రీశైల జగద్గురు సంస్థానాన్ని మంగళవారం సందర్శించిన సందర్భంగా శాసనాన్ని గుర్తించినట్టు ఆయన తెలిపారు, కాళయుక్తి సంవత్సరం శ్రావణ మాసంలో శ్రీశైల జగద్గురు బసవరాజ మహాదేవ సజీవసమాధిపై నాటి రాజ గురువు మహా మండలా చార్య శ్రీచంద్రభూషణ దేవ మహాచార్య బసవన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు శాసనంలో రాశారు, ఇంగ్లీషు తేదీ ప్రకారం సంస్థానంలో నంది విగ్రహ ప్రతిష్ఠ సామాన్య శకం 1438 ఆగస్టులో జరిగిందని మైనాస్వామి వివరించారు, చిన్న రాతి పలకపై తెలుగులో శాసనాన్ని రాయగా, పై భాగంలో నంది శిల్పాన్ని సుందరంగా మలిచారు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండో దేవరాయల (1424-1446) కాలంలో శ్రీశైల జగద్గురు నిడిమామిడి సంస్థానాధిపతి మహా మండలాచార్య శ్రీ చంద్రభూషణ దేవ మహాచార్య రాజ గురువుగా పనిచేశారు. శ్రీచంద్రభూషణ దేవ నిడిమామిడి నుంచి పెను కొండకు, అక్కడి నుంచి హంపికి వెళ్లి రాజ గురువుగా వ్యవహరించినట్టు చరిత్రకారుడు పేర్కొన్నారు.కాగా విజయనగర సామ్రాజ్య స్థాపనలో విద్యారణ్యస్వామి రాజ గురువుగా కీలక పాత్ర పోషించగా, శ్రీకృష్ణ దేవరాయల (1509-1529) పాలనలో శ్రీ వ్యాస రాయలు రాజ గురువుగా ఉన్నారు. కానీ నిడిమామిడి శాసనం ప్రకారం చంద్రభూషణ దేవ రాజ గురువుగా విజయనగర సామ్రాజ్యంలో విలసిల్లినట్టు తెలుస్తున్నదని మైనా స్వామి చెప్పారు. వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన శ్రీశైల జగద్గురు నిడిమామిడి సంస్థానం మూలమఠం సరైన ఆదరణకు నోచుకోలేదు. జగద్గురు మఠానికి అత్యంత విలువైన ఆస్తులు ఉన్నాయి. మఠానికి చెందిన వీరభద్ర స్వామి గుడి పునర్నిర్మాణము జరిగినా, కొన్ని వివాదాల వల్ల గుడి మూతపడడం బాధాకరం. వీరభద్ర స్వామి గుడి పూజారి శ్రీ వీరభద్రప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీరామచంద్రారెడ్డి, మహేష్ తదితరులు మూల మఠాన్ని సందర్శించారు.

## బండ రాళ్లు తరలించే

# ట్రాక్టర్లపై రాయల్టీ ఎత్తివేయాలి

### -దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రాయల్టీ ఎత్తివేసినా వసూలు చేస్తున్న చెక్పోస్ట్ సిబ్బంది




**గోరంట్ల -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** చేతివృత్తులపై ఆధారపడి కష్టపడి జీవనం సాగిస్తున్న వడ్డెర కులస్తులకు రాను రాను బ్రతకడానికి ఇబ్బందిగా మారుతోందని రాత్రి పగలు కష్టపడి బండలను రాళ్లను ట్రాక్టర్లలో తరలిస్తే రాయల్టీ కట్టాలని ఇటీవల ఎక్కడ చూసినా ఏర్పాటుచేసిన చెక్పోస్టుల సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని దాదాపు 100 మందికి పైగా వడ్డెర కార్మికులు మంగళ వారం ట్రాక్టర్లతో పట్టణంలో ర్యాలీగా వెళ్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా కార్యక్రమం నిర్వహించారు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గతంలో వట్టెర్లకు సంబంధించిన రాళ్ల తరలింపు విషయంలో రాయల్టీ జీవోను తీసివేసిన మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెక్పోస్టులలో రాళ్లు తరలించరాదని రాయల్టీ కట్టాలని క్యూబిక్ మీటర్ కు 248 రూపాయల ప్రకారం ఒక్కో ట్రాక్టర్ కు వెయ్యి రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అయితే ఒక్కో ట్రాక్టర్ కు రేయి పగలు కష్టపడి తరలిస్తే 800 కూలి పడుతుందని మేము ఎక్కడ నుండి రాయల్టీ కట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికే బెస్ట్ కళాశాల, కోడూరు, గుమ్మయ్యగారి పల్లి, కోరే వాండ్ల పల్లి, పాలసముద్రం, పత్తికుంట పల్లి, తదితర ప్రాంతాల్లో చెక్పోస్టులు ఏర్పాటు చేశారన్నారు, 50 ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని దాదాపు 250 మంది కుటుంబాలు 500 మంది కార్మికులు రాళ్ల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని రాయల్టీ పేరుతో తమను తమ కుటుంబాలను బ్రతకడానికి లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కార్యాలయం అధికారి ప్రదీప్ కు వినతిపత్రం సమర్పించారు, ఇలాగే రాయల్టీ వసూలు చేసి తమ కడుపులు కొడితే తాము జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపట్టి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని మీడియాకు తెలిపారు.



## సీజనల్ వ్యాధులపై

# ప్రజలకు అవగాహన కల్పించాలి

### - జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23 :** వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రభులే అవకాశాలు ఉన్నాయని వీటిపైన ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కస్తూరి రాజు పరిధిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. స్వస్థ నారి సశాక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరంలో మధుమేహ పరీక్షలు రక్తపోటు పరీక్షలు టి.బి శాంపిల్ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వర్షాకాలంలో దోమల వల్ల డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయని జ్వరాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పల్లెల్లో పర్యటించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలన్నారు.

ముఖ్యంగా కిషోర బాలికలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలన్నారు.15 సంవత్సరాల నుండి 49 సంవత్సరాలు లోపు ఉన్న మహిళలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించాలన్నారు. గర్భసంచి రొమ్ము క్యాన్సర్ పై స్క్రీనింగ్ చేసి వారికి ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఎం ఎల్ హెచ్ పి లకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం జరపాలన్నారు. జూన్ మాసం నుండి డిసెంబర్ వరకు మలేరియా చికెన్ గున్యా లాంటి వ్యాధులు ప్రభువే అవకాశాలు ఉన్నాయని వీటిపైన జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు.

డాక్టర్లు ఎప్పటికప్పుడు 104 ద్వారా గ్రామాలలో పర్యటించి పరీక్షలు నిర్వహిం చాలన్నారు.ఈ కార్యక్రమంలో మలేరియా సభ్యులు ఆఫీసర్ జయ రామయ్య డాక్టర్ జియా ఉల్లా ఎంపిహెచ్ఈ ఓ దేవదానం హెల్త్ సూపర్వైజర్లు మహమ్మద్ భాష మనీ సరళ దేవి, రాజేంద్ర ప్రసాద్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# పోషకాహార లోపాలపై అవగాహన కలిగి ఉండాలి



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం ,సెప్టెంబర్ 23 :** రక్తహీనత పోషకాహార లోపాలపై ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జోహార్ పేర్కొన్నారు.లక్కిరెడ్డిపల్లి సిడిపిఓ కార్యాలయంలో మంగళవారం పోషణ్ మా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు సంవత్సరాల పిల్లలు, గర్భవతులు పాలిచ్చు తల్లులు పోషకాహార జాగ్రత్తలు పాటించి ఆరోగ్యపరమైన మెరుగైన అలవాట్లు పాటించాలని అన్నారు. పిల్లలకు పాలు ఇచ్చి తల్లులు గర్భవతి గ్రుడ్డు ఆకుకూరలు కూర గాయలు మునగాకు వంటి పోషక ఆహారం తీసుకొని రక్తహీనతకు దూరంగా ఉండాలని అన్నారు.

అనంతరం గర్భవతులకు శ్రీమంతాలు మరియు చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు దాదిబి. రూప. ఉసెనమ్మ. సుజాత. సోని. శారదా. శివసుబ్బమ్మ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి అంగన్వాడి కార్యకర్తలు అలాగే మూడు మండలాల కార్యకర్తలు. గర్భ వతులు. బాలింతలు పాల్గొన్నారు.

## భూ సేకరణకు వ్యతిరేకంగా విజయవాడకు తరలిన వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు



**గోరంట్ల-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** బలవంతపు భూ సేకరణ కు వ్యతిరేకంగా నేడు బుధవారం 24వ తేదీన విజయవాడలో వ్యవసాయ కార్మిక , రైతు సంఘాలు ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాలో పాల్గొనడానికి వెళుతున్న పాలసముద్రం, తుంగోడు వ్యవసాయ కూలీలు, భూ నిర్వాసితులు తరలివెళ్లారు.ఈ సందర్భంగా నాసన్, బెల్, ఎయిర్ బస్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు విడుదల చేయాలన్నారు. బలవంతపు భూ సేకరణ ఆపాలన్నారు.పరిశ్రమలు పెట్టి మిగిలి ఉన్న బీడు భూములు తిరిగి రైతులకు ఇవ్వాలన్నారు,2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు, తరలి వెళ్లినవారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, వెంకట లక్ష్మమ్మ పెద్దన్న భూ నిర్వాసితులు అచ్చమ్మ, వెంకట రాముడు, ప్యారిమా, లక్ష్మీనరసమ్మ, శివన్న, హరీష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్‌పోర్టు ఓవర్సీస్ గార్మెంట్స్ తయారీ పరిశ్రమ సందర్శన

### - జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్





**గోరంట్ల-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** గోరంట్ల మండలం లోని గుంత పల్లి వద్ద గల టెక్స్ పోర్టు ఓవర్సీస్ గార్మెంట్స్ తయారీ పరిశ్రమను మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సందర్శించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరిశ్రవ ంలోని వివిధ విభాగాలను కలియతిరిగి తయారీ విధానాన్ని యాజమాన్యం ద్వారా తెలుసుకున్నారు. పరిశ్రమలో పనిచేయుచున్న కార్మికులను పలకరించి సంక్షేమ సమాచారం తెలుసుకున్నారు.పరిశ్రమలో పనిచేయుచున్న కార్మికుల వసతి సౌకర్యాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.పరిశ్రమలో రెడీమేడ్ గార్మెంట్స్ తయారుచేస్తూ దాదాపు 1500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని యాజమాన్యం కలెక్టర్ కు వివరించారు,ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, పరిశ్రమల యాజమాన్యం హెచ్ ఆర్ మేనేజర్ మహాదేవ్ గౌడ, ప్లాంట్ మేనేజర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు






**పుట్టపర్తి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 23:** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన శ్యాంప్రసాద్‌ని, జిల్లాఎస్పీ సతీష్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి విష్ణువర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు, త్వరలో ప్రతిష్టాత్మకంగా భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి ఉత్స వాలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయుచున్న శుభసందర్భంగా జయంతి ఉత్సవాలు ఏర్పాటులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని వారికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం ద్వారా 100వ జయంతి ఉత్సవాలు నిర్వహణ పనుల విషయాలపైన, జిల్లాలో ఉన్న శాంతిభద్రతల విషయాలపైన సుదీర్ఘంగా చర్చించి, జిల్లా లో నెలకొన్న అనేక విషయాలు గురించి వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మా వంతు బాధ్యతగా మీకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు, దీనికి జిల్లా కలెక్టర్ ఎస్పీ సానుకూలంగా స్పందించారని తేలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రొద్దం ఉత్తమరెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఇంచార్జ్ పిడి పార్థసారథి, జిల్లా సీనియర్ నాయకులు సుదర్శన్, కత్తి రాజ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ గౌడ్ జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, సీనియర్ నాయకులు శేషాద్రి నాయుడు, సుదర్శన్ నాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )